ఆదివారం
15-09-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 85
పేజీలు : 6+8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

'ఓహియో' హైతీలను పంపేస్తా: ట్రంప్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైతే ఓహియో నగరం నుంచి హైతీ శరణార్థులను తిప్పి పంపేస్తానని రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ శరణార్థుల్లో చాలా మంది చట్టబద్ధంగా అమెరికాలో ఉంటున్నప్పటికీ ట్రంప్ ఈ ప్రకటన చేయడం చర్యకు దారితీసింది. ఓహియోలోని స్ప్రింగ్ ఫీల్డ్‌లో డిపోర్టేషన్లు చేపడతామని లాస్‌ఏంజిల్స్ సమీపంలో ఉన్న గోల్ఫ్ రిసార్ట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ట్రంప్ తెలిపారు.

మచిలీపట్నంలో దారుణం: బాలికపై అత్యాచారం

విశాలాంధ్ర-మచిలీపట్నం: మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు, హత్యలు ఏమాత్రం ఆగడం లేదు. ఇటీవల కాలంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో అనేక అత్యాచార ఘటనలు వెలుగు చూశాయి. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం ఆర్జీ కర్ ఆస్పత్రిలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. నిందితులపై ఎన్ని కఠిన చర్యలు తీసుకుంటున్నా కామాంధుల్లో మాత్రం భయం కలగడం లేదు. దేశవ్యాప్తంగా ప్రతి రోజూ ఏదో ఓ మూలన లైంగిక దాడులు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా మచిలీపట్నంలో అలాంటి ఘటనే వెలుగు చూసింది. పట్టణానికి చెందిన పవన్ కుమార్ అనే యువకుడు ఓ బాలిక(15)పై

- మిగతా 2 లో

వంటనూనె ధరలకు రెక్కలు?

న్యూదిల్లీ: వంటనూనెల దిగుమతి సుంకాన్ని పెంచుతూ కేంద్రం నిర్ణయిం తీసుకుంది. ప్రాథమిక దిగుమతి సుంకాన్ని 20 శాతం పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. దాంతో వచ్చే పండగ సీజన్‌లో వీటి ధరలు పెరుగుతాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. భారత్‌లో ఎక్కువగా వినియోగిస్తున్న పామాయిల్, సోయానూనె, సన్‌ఫ్లవర్ ఆయిల్ దిగుమతులు తగ్గితే వాటి ధర పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. రానున్న పండగ సీజన్‌లో సగటు వినియోగదారులపై ఈ భారం పడనుందని అంచనా వేస్తున్నారు. ప్రపంచంలోనే అత్యధికంగా వంటనూనెలు దిగుమతి చేసుకుంటున్న భారత్‌లో దిగుమతి సుంకం పెంచడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దేశీయ నూనెగింజల రైతులను ఆదుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. దేశంలో ముడి పామాయిల్, సోయానూనె, సన్‌ఫ్లవర్ ఆయిల్‌పై అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ సెస్ వసూలు చేస్తుండడంతో గతంలో ఉన్న దిగుమతి సుంకం 5.5 శాతాన్ని 27.5 శాతానికి పెంచారు. రిఫైన్డ్ పామాయిల్, సోయా ఆయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్ దిగుమతులపై గతంలో ఉన్న 13.75 శాతం సుంకాన్ని 35.75 శాతానికి మారుస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏటా దేశీయంగా వినియోగించే వంటనూనెల్లో 70 శాతం కంటే ఎక్కువ ఇతర దేశాల నుంచే భారత్ కొనుగోలు చేస్తున్నది. ప్రధానంగా ఇండోనేషియా, మలేషియా, థాయిలాండ్ నుంచి పామాయిల్ దిగుమతి చేసుకుంటున్నది. అర్జెంటీనా, బ్రెజిల్, రష్యా, ఉక్రెయిన్ నుంచి సోయా ఆయిల్, సన్‌ఫ్లవర్

- మిగతా 2 లో

విజయవాడ-హైదరాబాద్ ఆరులైన్ల రహదారి

అమరావతికి అనుసంధానం

- గత నిర్ణయాన్ని సవరించిన కేంద్రం
- తాజాగా అనుమంచిపల్లి నుంచి గొల్లపూడి వరకు పొడిగింపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రెండు తెలుగు రాష్ట్రాల మధ్య అత్యంత కీలకమైన విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిని ఆరు వరుసల రహదారిగా తీర్చిదిద్దనున్నారు. వాహనదారులకు, ప్రయాణికులకు ఇది ముమ్మాటికీ శుభవార్తే. నిత్యం ట్రాఫిక్ రద్దీగా ఉండే విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిని పూర్తి స్థాయిలో 6 వరుసలుగా విస్తరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ రెండు ప్రాంతాలను కలుపుతూ ప్రస్తుతం ఉన్న నాలుగు వరుసల ఎన్‌హెచ్-65ను ఇకపై ఎలాంటి ఆటంకాలు లేకుండా కనీసం 100 కిలో మీటర్ల వేగంతో ప్రయాణించేలా రహదారిని తీర్చిదిద్దనున్నారు. ఇటీవల ఈ మార్గంలో మొత్తం 181.5 కిలో మీటర్లను ఆరు వరుసలకు విస్తరించాలని జాతీయ రహదార్ల మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. తొలుత కేవలం హైదరాబాద్ సమీపంలోని దండు మల్కాపూర్ నుంచి జగ్గయ్యపేట మండలం అనుమంచిపల్లి వరకు విస్తరించాలని నిర్ణయం తీసుకోగా, తాజాగా దానిని సవరిస్తూ, అనుమంచిపల్లి నుంచి గొల్లపూడి వరకూ ఆరు వరుసల రహదారిగా విస్తరించాలని నిర్ణయించింది. దండు మల్కాపూర్ నుంచి జగ్గయ్యపేట వరకు విస్తరణ పనులు చేపట్టేందుకు వీలుగా 181.5 కిలోమీటర్లకు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారు చేయించాలని ఇప్పటికే కేంద్ర ఆదేశాలు జారీ అయ్యాయి. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ రహదారికి ఉన్న ప్రాముఖ్యతను, రెండు రాష్ట్రాల మధ్య ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని గొల్లపూడి వరకు పొడిగిస్తే అమరావతి రాజధానికి అనుసంధానంగా ఉంటుందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో గొల్లపూడి వరకు మరో 40 మీటర్ల పొడిగింపునకు అనుగుణంగా డీపీఆర్ రూపొందించాలని నిర్ణయించారు. ఇప్పటికే చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారి బైపాస్ రోడ్డు గొల్లపూడి నుంచి అమరావతి రాజధాని మీదుగా వెళుతుంది. దీనికి హైదరాబాద్ నుంచి వచ్చే

- మిగతా 2 లో

దేశం ఏపీ వైపు చూసేలా...

- రాష్ట్రానికి ఎయిర్ కనెక్టివిటీ పెంపు
- ఏడాదిలోగా గన్నవరం కొత్త టెర్మినల్
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు
- విజయవాడ-దిల్లీ ఇండిగో సర్వీసు ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి/గన్నవరం: ఆంధ్ర ప్రదేశ్ నుంచి దేశంలోని అన్ని ముఖ్య ప్రాంతాలకు వెళ్లేలా ఎయిర్ కనెక్టివిటీని పెంచుతామని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. గన్నవరం విమానాశ్రయంలో శనివారం అప్రోచ్ రహదారిని, విజయవాడ-దిల్లీ ఇండిగో సర్వీసును మంత్రి

- మిగతా 2 లో

అంతరిక్షం నుంచే ఓటు వేస్తాం

సునీతా విలియమ్స్, విల్‌మోర్

వాషింగ్టన్: ఈ ఏడాది జరిగే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో అంతరిక్షం నుంచే ఓటు హక్కు వినియోగించుకుంటామని స్టార్‌లైనర్ స్పేస్ మిషన్ వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్ తెలిపారు. విలియమ్స్, విల్‌మోర్ తిరిగి భూమిపైకి రావడానికి సమయం పట్టనుండటంతో అక్కడి నుంచే ఓటే వేస్తామని చెబుతున్నారు. సునీతా విలియమ్స్, విల్‌మోర్ తాజాగా స్పేస్ నుంచి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల గురించి ప్రస్తావించారు. నవంబర్‌లో జరిగే

- మిగతా 2 లో

లక్షల కోట్లలో జీఎస్టీ ఎగవేత

న్యూదిల్లీ: పన్ను ఎగవేతలు ఆగడం 2023-24లో రూ.2.01 లక్షల కోట్లు జీఎస్టీ ఎగవేతలను గుర్తించినట్లు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ (డీజీజీఐ) తెలిపింది. మొత్తం 6084 కేసుల్లో ఇది తేలిందని పేర్కొంది. ఆన్‌లైన్ గేమింగ్ రంగం నుంచే ఎక్కువ మొత్తంలో పన్ను ఎగవేతలు జరిగినట్లు గుర్తించింది. సేవల

- మిగతా 2 లో

కబ్జాకోరల్లో చెరువులు

ఆక్రమణలతో కనుమరుగు

- పూడ్చి పట్టాలు పొందిన అక్రమార్కులు
- ప్రభుత్వం దృష్టిపెట్టకుంటే అంతర్థానం ఖాయం
- వరదలు వస్తే మరో విజయవాడ తథ్యం

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: జిల్లా కేంద్రమైన ఏలూరు నగరంలో చెరువులు క్రమంగా బక్కచిక్కిపోతున్నాయి. ఒక్కొక్కటిగా మాయమైపోతున్నాయి. కొన్నాళ్ల క్రితం కనిపించిన చెరువులు క్రమేణ అంతర్థానం అయిపోతున్నాయి. కొందరు స్వార్థపరుల ఆక్రమణల కోరల్లో చిక్కి శల్యమైపోతున్నాయి. దీంతో సర్వత్ర ఆందోళన వ్యక్తం అవుతోంది. అత్యాశపరులు కొందరు ఆత్రంగా చెరువులను మింగేస్తున్నారు. అభివృద్ధి పేరుతో ఇసుక, మట్టి, బండ రాళ్లతో చెరువులను పూడ్చేస్తున్నారు. ఆక్రమించిన ప్రతిచోట పట్టాలు పొంది, పక్కా బిల్డింగులు కట్టి, చెరువులను నివాసాలుగా మార్చేస్తున్నారు. ఇటువంటి చర్యల కారణంగా చెరువుల అస్తిత్వానికే ప్రమాదం వాటిల్లే ప్రమాదం దాపురించింది. నగరపాలక సంస్థ రికార్డులు ప్రకారం ఏలూరు టౌన్‌లో పది చెరువులు ఉండాలి. అతిపెద్ద చెరువుగా పేరొందిన శేషయ్య నాయుడు చెరువు ఆక్రమణలతో కనుమరుగైపోయింది. వన్ టౌన్‌లో పేరయ్య కోనేరు, టుటౌన్ పవర్ పేట వాసు దేవాలయం వద్ద పడవల రేవులకు ఎంతో చరిత్ర ఉంది. గోదావరి నుంచి ఏలూరు కాలవ ద్వారా పడవల్లో ఇసుక ఏలూరు తీసుకువచ్చి ఈ రేవులో విక్రయించేవారు. కాలక్రమేణ ఇసుక రవాణా నిలిచిపోయింది. ప్రస్తుతం వాసు దేవాలయం వద్ద ఉండే చెరువులో కొందరు హక్కు పత్రాలు పొంది నివాసాలు ఏర్పరుచుకున్నారు. వన్‌టౌన్ ప్రాంతంలో లక్ష్మయ్య చెరువు 12 ఎకరాలు విస్తీర్ణంలో ఉండేది. ఆక్రమణదారులు దాదాపు 10 ఎకరాలు పూడ్చేశారు. పట్టాలు పొంది,

- మిగతా 2 లో

'మీ సోదరి'గా అభ్యర్థిస్తున్నా...

- సమ్మె విరమించి విధుల్లో చేరండి
- జూనియర్ వైద్యులకు సీఎం మమత విజ్ఞప్తి

కోల్‌కతా: 'మీ సోదరిగా అభ్యర్థిస్తున్నా...' సమ్మె విరమించి విధుల్లో చేరాలని పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నిరవధిక నిరసన కొనసాగిస్తున్న జూనియర్ వైద్యులకు విజ్ఞప్తి చేశారు. శనివారం ఉదయం ముఖ్యమంత్రి అందరినీ ఆశ్చర్యపరిచారు. తిరిగి విధుల్లోకి రావాలని కోరుతూ జూనియర్ వైద్యుల నిరసన స్థలానికి వెళ్లారు. తాను ముఖ్యమంత్రిగా కాకుండా సోదరిగా వచ్చానని ఆమె అన్నారు.

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతా జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనకు వ్యతిరేకంగా నిరసనలు తెలుపుతున్న జూనియర్ వైద్యులకు, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య చర్చల విషయంలో ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. ఈ హత్యాచార ఘటనను నిరసిస్తూ కోల్‌కతా శివారులోని సాల్ట్‌లేక్ ప్రాంతంలోని పశ్చిమ బెంగాల్ ఆరోగ్యశాఖ ప్రధాన కార్యాలయం 'స్వస్థ్ భవన్' ఎదుట జూనియర్ వైద్యులు నెల రోజులుగా ఆందోళన సాగిస్తున్న విషయం తెలిసిందే. ఈ మధ్యాహ్నం నిరసన శిబిరానికి సీఎం మమత వెళ్లారు. ఆమెను చూడగానే 'న్యాయం కావాలి' అంటూ జూనియర్ వైద్యులు నినాదాలు చేశారు. అయితే వైద్యుల వ్యతిరేక నినాదాల మధ్య బెంగాలీలో సీఎం మాట్లాడుతూ ఈ సమస్యను

- మిగతా 2 లో

17న కొల్లేరు టు బుడమేరు

సీపీఐ, రైతుసంఘం ప్రతినిధి బృందం పర్యటన

విశాలాంధ్ర-విజయవాడ: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల నష్టపోయిన ప్రాంతాలను పరిశీలించడానికి సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అధ్వర్యంలో 17వ తేదీన కొల్లేరు నుంచి బుడమేరు వరకు కార్యక్రమాన్ని సీపీఐ, రైతుసంఘం ప్రతినిధి బృందం చేపట్టనున్నది. ఈ మేరకు సీపీఐ రాష్ట్ర కార్యాలయం ప్రతినిధి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతినిధి బృందంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్‌తో పాటు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, కార్యవర్గ సభ్యులు, కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల కార్యదర్శులు పాల్గొంటారని పేర్కొన్నారు. కొల్లేరు, బుడమేరు వరద నష్టాలను బృందానికి వివరించేందుకు సంబంధిత అధికారులను పురమాయించి తమకు సహకరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

కార్యక్రమం వివరాలు

17వ తేదీ ఉదయం 9:00 గంటలకు ఏలూరు, 10:00 గంటలకు పెదఎడ్లగాడి (శ్రీపర్రు పైన) కొల్లేరు, 11:30 గంటలకు హనుమాన్ జంక్షన్, 12:00 గంటలకు పుట్టగుంట, మధ్యాహ్నం 1:00 గంటకు హనుమాన్ జంక్షన్ వద్ద భోజన విరామం, మధ్యాహ్నం 3:00 గంటలకు కేసరపల్లి, సాయంత్రం 4:00 గంటలకు ఎనికేపాడు వద్ద ముగుస్తుంది.

పీవీఆర్ చౌదరి కన్నుమూత

6లో

ఇదీ లోకం!

ఏపీ గనులశాఖ మాజీ డైరెక్టర్

వెంకటరెడ్డి కోసం ఏసీబీ వేట

కేసు నమోదైనప్పటి నుంచి అజ్ఞాతంలోకి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో ఇసుక తవ్వకాలు, అక్రమ రవాణ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ముఖ్యమంత్రి జగన్ సన్నిహితుడు, గనుల శాఖ మాజీ డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డి కోసం ఏసీబీ అధికారులు విస్తృతంగా గాలిస్తున్నారు. గురువారం ఆయనపై కేసు నమోదు కాగా... అప్పటి నుంచి మూడు బృందాలు ఆయన కోసం విస్తృతంగా గాలిస్తున్నాయి. ఆయన సన్నిహితులు, బంధువులకు చెందిన ప్రాంతాలతో పాటు పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, తమిళనాడులోనూ ఏసీబీ ప్రత్యేక బృందాలు అన్వేషిస్తున్నాయి. చెన్నై, తిరుపతి, అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు, కొర్లకుంట తదితర గ్రామాల్లోని ఆయన నివాసాలతోపాటు

- మిగతా 2 లో

ఏచూరికి తుది వీడ్కోలు

- నివాళులర్పించిన ప్రముఖులు 2లో
- దిల్లీ ఎయిమ్స్‌కు భౌతికకాయం అప్పగింత

సమర్థ పాలనే మన లక్ష్యం: జిన్‌పింగ్

బీజింగ్: సమర్థ పాలనే తమ లక్ష్యమని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఉద్ఘాటించారు. నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ 70వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బీజింగ్‌లో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. పరిపాలనను, రాజకీయ వ్యవస్థను మరింత సమర్థంగా నిర్వహించేందుకు అన్ని విధాలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలతో మమేకం కావాలని, ప్రజా సభలు, మహాసభలు నిర్వహించాలన్నారు. చైనా లక్షణాలతో సోషలిజం సంస్కృతి, సిద్ధాంతాలు, విధానాలను మరింతగా పెంపొందించాల్సిన అవసరం ఉందని సూచించారు. చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి, కేంద్ర సైనిక కమిషన్ చైర్మన్ హోదాలో జిన్‌పింగ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఉక్రెయిన్‌తో శాంతి చర్యలకు కసరత్తు

ఉక్రెయిన్ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు, శాంతి చర్చలకు కట్టుబడి ఉన్నామని చైనా విదేశాంగ మంత్రి చెన్ జియాదాంగ్ అన్నారు.

బీజింగ్‌లో జరిగిన 11వ జియాంగ్షన్ భద్రతా ఫోరం సదస్సులో ఆయన మాట్లాడుతూ ఉక్రెయిన్‌తో శాంతి చర్చల కోసం తమ వంతు ప్రయత్నాలను చైనా కొనసాగిస్తోందని, అన్ని వర్గాలతో సంప్రదింపులు జరుపుతోందని చెప్పారు. శాంతి చర్చలకు వారధి నిర్మాణం దిశగా ఏకాభిప్రాయానికి యత్నిస్తోందన్నారు. భద్రతా ఫోరం సదస్సు చైనా రాజధాని బీజింగ్‌లో ఈనెల 12 నుంచి 14 తేదీ వరకు జరిగింది. సదస్సులో రష్యా ప్రతినిధులు హాజరయ్యారు. రష్యా ప్రతినిధుల బృందానికి రక్షణశాఖ సహాయక మంత్రి కల్నల్ జనరల్ అలగ్జాండర్ ఫోమిన్ నాయకత్వం వహించారు.

ఏచూరికి కేకేఈ నివాళి

ఏథెన్స్: సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణానికి గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) నివాళు లర్పించింది. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి ఏచూరి గొప్ప తోడ్పాటు అందజేశారని శ్లాఘించింది. కేకేఈ తరఫున ఏచూరి కుటుంబానికి, అభిమానులు, పార్టీ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపింది. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం, అంతర్జాతీయ కమ్యూనిస్టు, వర్కర్ల పార్టీల సమావేశాల్లో సీతారాం ఏచూరి గణనీయమైన తోడ్పాటు అందజేశారని కేకేఈ ప్రధాన కార్యదర్శి కౌంట్ సోంబస్ సంతాప సందేశంలో పేర్కొన్నారు. గ్రీస్‌లో గ్రీక్ కమ్యూనిస్టుల్లో ఆయనకు మంచి గుర్తింపు ఉందని, తమ రెండు పార్టీల మధ్య బంధాన్ని బలపర్చడంలో కీలక పాత్ర పోషించారని ఏచూరిని కౌంట్‌సోంబస్ కొనియాడారు. 50ఏళ్ల ప్రజా జీవితంలో కమ్యూనిస్టు ఉద్యమానికి, భారతీయ ప్రజలకు, శ్రామిక వర్గానికి సేవలు అందించారని, సీపీఎంలో అంచెలంచెలుగా ఎదిగారని కౌంట్‌సోంబస్ పేర్కొన్నారు.

ఇరాన్ పరిశోధన ఉపగ్రహ ప్రయోగం విజయవంతం

టెహ్రాన్: ఇరాన్ ఉపగ్రహ ప్రయోగం విజయవంతమైంది. పరిశోధనా ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్షలో చేర్చినట్లు ఇరాన్ ప్రకటించింది. ఛార్మన్-1 ఉపగ్రహం బరువు 60కేజీలు, అంతరిక్షంలోని 550కిమీల కక్షలోకికి దానిని ప్రవేశపెట్టామని అధికారిక ఐఆర్ఎన్ఏ శనివారం నివేదించింది. అంతరిక్ష హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌ను పరీక్షించడం కోసమే ఈ మిషన్ అని తెలిపింది. ఉపగ్రహం నుంచి భూమి మీదకు సంకేతాలు అందినట్లు ఐఆర్ఎన్ఏ వెల్లడించింది. గార్డ్ ఎయిరోస్పేస్ విభాగం రూపొందించిన రాకెట్ ఘేం-100 ఈ ఉపగ్రహాన్ని నింగిలోకి మోసుకెళ్లిందని నివేదిక పేర్కొంది.

వంటనూనె ధరలకు రెక్కలు?

(మొదటిపేజీ తరువాయి)

ఆయిల్ దిగుమతి అవుతోంది. ఉల్లి ఎగుమతులపై నిషేధాన్ని ఎత్తివేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దేశీయంగా ఉల్లి ధరలు పెరగకుండా ఎగుమతులపై కేంద్రం గతేడాది ఆంక్షలు విధించింది. తాజాగా వీటిని ఎత్తేయడంతో తిరిగి ఎగుమతులు పెరిగే అవకాశం ఉన్నట్లు మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ప్రభుత్వం తొలుత ఆంక్షలు పెట్టిన సమయంలో 40 శాతం ఎగుమతి సుంకం చెల్లించాలనే నిబంధన తీసుకొచ్చారు. ప్రస్తుతం అది 20 శాతంగా ఉంది. మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోంది. సమీప భవిష్యత్తులో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని యోచిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

వెంకటరెడ్డి కోసం ఏసీబీ వేట

(మొదటిపేజీ తరువాయి)

రైల్వే కోడూరులోని ఆయన అత్తగారి ఇంట్లోనూ సోదాలు నిర్వహించిన ఏసీబీ అధికారులు... ఇప్పటికే కొన్ని కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఇసుక కాంట్రాక్టు, నిర్వహణలో రూ.2,500 కోట్ల మేర అక్రమాలు జరిగినట్టు ఏసీబీ గుర్తించింది. కేసు నమోదైన వెంటనే వెంకటరెడ్డి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో గనుల శాఖలో ఆయన సన్నిహితులను ఏసీబీ విచారిస్తూనే... వెంకటరెడ్డి కోసం విస్తృతంగా గాలిస్తోంది.

బాలికపై అత్యాచారం

(మొదటిపేజీ తరువాయి)

అత్యాచారం చేశాడు. కొన్ని రోజులుగా చిన్నారి వెంట పడుతున్న కామాంధుడు... ఆమె కదలికలపై నిఘా పెట్టాడు. శుక్రవారం రాత్రి 8:30 గంటలకు ఆ బాలిక ఒంటరిగా వస్తున్న విషయం తెలుసుకుని దాడికి పాల్పడ్డాడు. బలవంతంగా ద్విచక్రవాహనం ఎక్కించుకుని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు. ఆపై అత్యాచారానికి ఒడిగట్టాడు. అనంతరం అక్కడి నుంచి పారిపోయాడు. ఘటన గురించి బాధిత చిన్నారి కుటుంబసభ్యులకు తెలిపింది. దీంతో హుటాహుటిన వారంతా పోలీసులను ఆశ్రయించారు. బాలిక ఫిర్యాదు మేరకు ఫోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ అబ్దుల్ నబీ తెలిపారు. చిన్నారులు, మహిళలపై అత్యాచారాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

అంతరిక్షం నుంచే ఓటు వేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

అధ్యక్ష ఎన్నికల్లో ఐఎస్ఎస్ నుంచే ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. అమెరికా పౌరులుగా ఓటు హక్కు వినియోగించుకోవడం తమ కర్తవ్యమన్నారు. బ్యాలెట్ కోసం తమ అభ్యర్థనను నాసాకు పంపామని, ఇందుకు నాసా సహకరిస్తుందని అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉండగా.. సునీతా విలియమ్స్, విల్‌మోర్‌లను ఐఎస్ఎస్ (అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం) వద్దే వదిలేసి బోయింగ్ స్టార్‌లైనర్ వ్యోమనౌక భూమిపైకి చేరుకుంది. వ్యోమగాములు లేని ఖాళీ స్పేస్‌క్రాఫ్ట్ వారం రోజుల క్రితం న్యూమెక్సికోలో దిగింది. సెప్టెంబర్‌లో 'నాసా' స్పేస్ ఎక్స్‌కు చెందిన 'డ్రాగన్' రాకెట్‌ను పంపేందుకు సిద్ధమవుతున్నది.

అమరావతికి అనుసంధానం

(మొదటిపేజీ తరువాయి)

రహదారిని అనుసంధానం చేయనున్నారు. డీపీఆర్ రూపకల్పనకు ఈనెల 24ను తుది గడువుగా నిర్ణయిస్తూ తాజాగా టెండర్లకు కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. వాస్తవానికి ఈ మార్గంలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్న 17 బ్లాక్ స్పాట్స్‌ను చక్కదిద్దేందుకు రూ.325 కోట్లతో టెండర్లు పిలిచి పనులను కూడా కాంట్రాక్టు సంస్థకు జాతీయ రహదారుల సంస్థ అప్పగించింది. ఇప్పుడు 221.5 కిలోమీటర్ల మేర విస్తరించే డీపీఆర్‌లో దిద్దుబాటు పనులను మినహాయించినట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. నందిగామ వద్ద నిర్మాణంలో ఉన్న బైపాస్ రోడ్డు పనులను కూడా ఈ టెండరు పరిధి నుంచి తొలగించారు. జగ్గయ్యపేట నుంచి గొల్లపూడి వైపు తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు, పెరుగుతున్న వాహనాలను దృష్టిలో ఉంచుకుని తాజా నిర్ణయాన్ని తీసుకున్నారు. 6 లైన్లకు జాతీయ రహదారిని విస్తరించడం మూలంగా వాహనాల రాకపోకలకు ఆటంకాలు తొలగుతాయని జాతీయ రహదారుల సంస్థ అధికారులు వెల్లడించారు.

ఏచూరికి తుది వీడ్కోలు

న్యూదిల్లీ: సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి పార్టీలకు అతీతంగా జాతీయ స్థాయి నాయకులు నివాళులర్పించారు. దిల్లీలోని ఏచూరి ఇంటికి వెళ్లి సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అరుణాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. సీపీఎం కేంద్ర కార్యాలయం ఏకేజి భవన్‌లో ఏచూరి భౌతికకాయాన్ని సందర్శనార్థం ఉంచగా లాల్ సలామ్ నినాదాలు మార్మోగాయి. ఏకేజి భవన్‌లో ఏచూరి భౌతికకయాన్ని సందర్శించి ఆయనకు కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, ఎన్‌సీపీ (ఎస్పీ) అధ్యక్షుడు శరద్ పవార్, ఆప్ నేతలు సంజయ్ సింగ్, మనీశ్ సిసోడియా, త్రిపుర మాజీ సీఎం మాణిక్ సర్కార్, సీపీఎం సీనియర్ నేత బిమన్ బోస్, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, సీపీఐ(ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పీ) అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ పుష్పాంజలి ఘటించారు. ఏచూరి భౌతికకాయాన్ని ఏకేజి భవన్‌లో మధ్యాహ్నం 3 గంటల వరకు ఉంచారు. అనంతరం అక్కడ నుంచే అంతిమ యాత్రను ఎయిమ్స్ వరకు నిర్వహించారు. 'లాల్‌సలామ్ కామ్రేడ్' నినాదాలతో యాత్ర హోరెత్తింది. ఏచూరి కోరిక మేరకు కుటుంబ సభ్యులు ఆయన భౌతికకాయాన్ని వైద్య పరిశోధనల కోసం ఎయిమ్స్‌కు అప్పగించారు. ఏచూరికి నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు పి.చిదంబరం, అజయ్ మాకెన్, జైరాం రమేశ్, ఎంపీ కపిల్ సిబల్, నేపాల్ మాజీ ప్రధాని మాధవ్ కుమార్, డీఎంకే ఎంపీ కనిమొళి, రాజస్థాన్ మాజీ సీఎం అశోక్ గెహ్లాట్, భారత్‌కు చైనా రాయబారి జు ఫెహాంగ్ ఉన్నారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, బీఎస్‌పీ అధినేత్రి మాయావతి కూడా సంతాపం ప్రకటించారు. కాగా, ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌తో సీతారాం ఏచూరి ఈనెల 12న మరణించారు.

జత్వాని ఫిర్యాదుతో విద్యాసాగర్‌పై ఎఫ్ఐఆర్

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం: నటి కాదంబరి జత్వాని ఫిర్యాదుతో న్యాయ సలహా అనంతరం శనివారం ఎఫ్ఐఆర్ నమోదైంది. తల్లిదండ్రులు, సోదరులతో కలసి ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన జత్వాని... విద్యాసాగర్‌తో పాటు మరి కొందరిపై సీఐ చంద్రశేఖర్‌కు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. కొందరు తనను బంధించి వేధించినట్లు వెల్లడించారు. గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన ముగ్గురు ఐపీఎస్‌ల పేర్లు ఈ కేసులో ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికే పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబుకు జత్వాని ఫిర్యాదు చేయగా దర్యాప్తు అధికారిగా ఏసీపీ స్రవంతి రాయ్‌ను నియమించారు. ఇబ్రహీంపట్నంలోనే ఈమెను బంధించారని వాదనలున్నాయి. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లోనే ఫిర్యాదు చేయడంతో ఈ వాదనకు బలం చేకూరింది. కాగా, ప్రధాన నిందితుడు కుక్కల విద్యాసాగర్‌తో పాటు మరి కొందరిపై 192, 211, 218, 220, 354(0), 467, 420, 469, 471సెక్షన్ల కింద కేసులు నమోదైనట్లు సీఐ వెల్లడించారు.

కాంట్రాక్టు నర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ

జాన్సన్ బాబు డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కాంట్రాక్ట్ నర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్ బాబు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న 11 వేల మంది బీఎస్‌సీ నర్సింగ్, ఎంఎస్‌సీ నర్సింగ్ పూర్తి చేసి ప్రభుత్వాస్పత్రుల్లో కష్టపడుతూ, అనారోగ్య బారినపడిన ప్రజలకు ఎనలేని సేవలు అందిస్తుండగా ప్రభుత్వం నర్సింగ్ వ్యవస్థను నిర్వీర్యం చేయాలనే కుట్ర చేస్తోందని విమర్శించారు. నర్సింగ్ కోర్సులు పూర్తి చేసిన అర్హులైన విద్యార్థులను ప్రభుత్వం నర్సింగ్ ఉద్యోగులుగా కాకుండా కాంట్రాక్టు నర్సింగ్ ఉద్యోగాలుగా మార్చేసిందని విమర్శించారు. కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ పద్ధతిని తీసుకొచ్చి వారి జీవితాలతో ఆటలాడుతున్నారని దుయ్యబట్టారు. పైగా నర్సింగ్ ఉద్యోగులకు శాపంగా జీవో నంబరు 115 తీసుకువచ్చి, వీరికి పోటీగా ఏఎన్ఎంలను స్టాఫ్ నర్సులను చేయడం వల్ల హాస్టళ్లలో ఉండి చాలీచాలని తిండి తిని తల్లిదండ్రుల కష్టం మీద చదువుకుని నర్సింగ్ పూర్తి చేసిన వచ్చిన పేద విద్యార్థుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే జీవో నంబరు 115 ను రద్దు చేసి, కాంట్రాక్ట్ నర్సింగ్ ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా మార్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఏఐఎస్ఎఫ్ సంపూర్ణ మద్దతు తెలియజేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వారి డిమాండ్లను పరిష్కారం చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

లక్షల కోట్లలో జీఎస్టీ ఎగవేత

(మొదటిపేజీ తరువాయి)

విభాగంలో ఆన్‌లైన్ గేమింగ్, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ)తో పాటు ఇనుము, రాగి, తుక్కు మిశ్ర ధాతువు వంటి ఖనిజాలకు సంబంధించి 1976 కేసుల్లో రూ.16,806 కోట్లు మేర ఎగవేతలు జరిగినట్లు తెలిపింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 4872 కేసుల్లో రూ.1.01 లక్షల కోట్ల ఎగవేతలను డీజీజీఐ గుర్తించింది. 2023-24లో ఆ మొత్తం రూ.2.01 లక్షల కోట్లకు పెరిగింది. ఇందులో రూ.26,605 కోట్లు స్వచ్ఛందంగా వసూలైనట్లు డీజీజీఐ తెలిపింది. 2022-23లో ఈ మొత్తం రూ.20,713 కోట్లుగా ఉంది. మొత్తం ఎగవేతల్లో పూర్తిగా పన్నులు చెల్లించకపోవడానికి (అక్రమ మార్గంలో సరఫరా, తక్కువ విలువ చూపడం) సంబంధించిన కేసులు 46 శాతం ఉన్నాయి. ఇందులో 20 శాతం నకిలీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌కు సంబంధించినవిగా డీజీజీఐ వెల్లడించింది. 78 కేసుల్లో రూ.81,875 కోట్ల మేర పన్ను ఎగవేసినట్లు తెలిపింది. బీఎఫ్ఎస్ఐ రంగంలో 171 కేసుల్లో రూ.18,961 కోట్లు, కాంట్రాక్టు సర్వీసులకు సంబంధించి 343 కేసుల్లో రూ.3846 కోట్లు, ఫార్మాకు సంబంధించి 22 కేసుల్లో రూ.40 కోట్లు మేర పన్ను ఎగవేతలు గుర్తించినట్లు వెల్లడించింది. మసాలా, పొగాకు, సిగరెట్, బీడీలకు సంబంధించిన ఉత్పత్తుల విషయంలో రూ.5794 కోట్ల మేర ఎగవేతలు గుర్తించినట్లు డీజీజీఐ పేర్కొంది. జీఎస్టీ అమల్లోకి వచ్చిన 2017లో రూ.7,879 కోట్లుగా ఉన్న ఎగవేతల మొత్తం 2018-19లో రూ.19,319 కోట్లకు, 2019-20లో రూ.21739 కోట్లకు, రూ.2020-21లో రూ.31,908 కోట్లు, 2021-22లో రూ.50,325 కోట్లు, 2022-2023లో 1.01 లక్షల కోట్లు లెక్కన పెరిగింది.

'మీ సోదరి'గా అభ్యర్థిస్తున్నా...

(మొదటిపేజీ తరువాయి)

పరిష్కరించడానికి ఇదే తన చివరి ప్రయత్నం అని అన్నారు. 'గతంలో నేనూ విద్యార్థి నాయకురాలిగా ఉద్యమాల్లో పాల్గొన్నా. ఆందోళన చేయడం మీ హక్కు. కానీ సమస్యను పరిష్కరించేందుకు మీతో చర్చల కోసం చాలా రోజుల నుంచి ఎదురు చూస్తున్నా. భద్రతా సిబ్బంది వద్దని చెప్పినప్పటికీ మీ ఆందోళనలకు సెల్యూట్ చేసేందుకు వచ్చా. ఇక్కడికి నేను ముఖ్యమంత్రిగా రాలేదు. మీ దీదీ (సోదరి) గా వచ్చా. నాకు సీఎం పదవి ముఖ్యం కాదు. కానీ నేనొక్కదాన్నే ప్రభుత్వాన్ని నడపట్లేదు కదా. బాధితురాలికి న్యాయం జరగాలనే నేనూ కోరుకుంటున్నా' అని తెలిపారు. 'ఎండా, వానల్లోనూ మీరు రోడ్లపై ఆందోళన చేస్తుంటే నేను ఎన్నో నిద్రలేని రాత్రులు గడుపుతున్నా. నేను ఎలాంటి చర్య తీసుకోను. నేను యూపీ పోలీసును కాదు. వారు ఎస్మా (అత్యవసర సేవల నిర్వహణ చట్టం) అమలుకు నడుం బిగించారు. నేను అలా చేయను' అని ఆమె తాత్కాలిక వేదిక నుంచి ప్రకటించింది. 'గుర్తుంచుకోండి... 17వ తేదీ మంగళవారం సుప్రీం కోర్టు విచారణ ఉంది. మీకు ఎలాంటి హాని జరగకూడదనుకుంటున్నాను. నేను మీ సోదరిని. నేను ముఖ్యమంత్రిగా కాకుండా మీ ఉద్యమానికి సానుభూతిపరురాలిగా మీ అక్కగా ఇక్కడకు వచ్చాను. మీ డిమాండ్లను సానుభూతితో వింటామని, పోలీసు ఏడీజీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ పంత్, హోం శాఖ కార్యదర్శి నందిని చక్రవర్తితో చర్చిస్తామని ఆమె జూనియర్ వైద్యులకు హామీ ఇచ్చారు. 'దయచేసి నాకు కొంత సమయం ఇవ్వండి' అని మమత అన్నారు. ఆర్‌జీ కర్ అంశాన్ని విచారిస్తున్న సుప్రీం కోర్టు త్రిసభ్య ధర్మాసనానికి నేతృత్వం వహిస్తున్న భారత ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ చంద్రచూడ్ మంగళవారం జూనియర్ వైద్యులను బుధవారం సాయంత్రం 5 గంటలలోగా విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించారు. 'మీ డిమాండ్లను కచ్చితంగా అధ్యయనం చేస్తాం. బాధ్యులను కఠినంగా శిక్షిస్తాం. ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో రోగుల సంరక్షణ కమిటీని రద్దు చేస్తున్నా. దర్యాప్తును మరింత వేగవంతం చేయాలని సీబీఐని కోరుతున్నా. నామీద విశ్వాసం ఉంటే... చర్చలకు రండి. మీరు వెంటనే విధుల్లో చేరండి. మీపై ఎలాంటి చర్యలు తీసుకోబోం' అని మమతా బెనర్జీ కోరారు. అయితే తమ ఐదు డిమాండ్లపై ప్రత్యక్ష ప్రసారంలో చర్చలు జరిగే వరకు రాజీపడే ప్రసక్తే లేదని ఆందోళన చేస్తున్న జూనియర్ వైద్యులు మీడియాతో అన్నారు.

రోగుల సంరక్షణ కమిటీల రద్దు

అన్ని ప్రభుత్వాస్పత్రులు, ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలలో రోగుల సంక్షేమం కోసం సంఘాలు (రుగీ కళ్యాణ్ సమితి) లను రద్దు చేస్తున్నట్లు సీఎం మమతా బెనర్జీ ప్రకటించారు. రోగుల సంరక్షణ కమిటీలు జాతీయ ఆరోగ్య మిషన్ దిశలో దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ సౌకర్యాల వద్ద ఏర్పాటయ్యాయి. వీటి ప్రాథమిక పాత్ర మౌలిక, పరిపాలనా నిర్ణయాలు, కొనుగోళ్లు, రోగుల ప్రవేశాన్ని ఆమోదించడం. ఎన్‌హెచ్‌ఎం, ఆరోగ్యశాఖ అధికారులు, జిల్లా అధికారులు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులతో పాటు ఎమ్మెల్యే/ఎంపీ ప్రతినిధులను కమిటీలో చేర్చారు. కోల్‌కతా, రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో సమితి అధిపతుల్లో ఎక్కువ మంది మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉన్నారు. ముఖ్యమంత్రి పదవితో పాటు ఆరోగ్య శాఖను నిర్వహిస్తున్న మమతా బెనర్జీ... రాష్ట్రంలో రుగీ కళ్యాణ్ సమితిలు ఎలా పనిచేస్తున్నాయో తనకు తెలియదని అన్నారు. 'చికిత్స లేకపోవడం వల్ల చాలా మంది మరణించారని నేను నమ్ముతున్నాను. మీ తల్లిదండ్రులు కూడా ఆందోళన చెందుతున్నారు. దయచేసి పనిని పునః ప్రారంభించండి. మేము ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, అభివృద్ధి చేసే పనిని ప్రారంభించాం. రాష్ట్రంలో అన్ని రుగీ కళ్యాణ్ సమితిలు రద్దయ్యాయి. వైద్య కళాశాల ఆస్పత్రుల ప్రిన్సిపాల్స్ ఇప్పుడు బోర్డుకు నాయకత్వం వహిస్తారు. ఇందులో పోలీసులు, జూనియర్ వైద్యులు, నర్సుల ప్రాతినిధ్యం ఉంటుంది' అని ముఖ్యమంత్రి చెప్పారు. ఆమె వెంట బెంగాల్ తాత్కాలిక పోలీసు డైరెక్టర్ జనరల్ రాజీవ్ కుమార్ కూడా ఉన్నారు.

చైనాలోనూ మాధవి బచ్‌కు పెట్టుబడులు: కాంగ్రెస్

న్యూదిల్లీ: సెబీ చైర్‌పర్సన్ మాధవి పూరి బచ్‌పై విమర్శలకు కాంగ్రెస్ పదును పెంచింది. ఆమెకు చైనాలో పెట్టుబడులు ఉన్నట్లు తాజాగా ఆరోపించింది. రూ.36.9 కోట్లు విలువ చేసే లిస్టెడ్ సెక్యూరిటీలో ట్రేడింగ్ చేసినట్లు పేర్కొంది. 2017 నుంచి 2023 వరకు చైనాతో సహా విదేశాల్లో పెట్టుబడులు పెట్టినట్లు తెలిపింది. సెబీకి విరుద్ధంగా మాధవి బచ్ వ్యవహరించారని కాంగ్రెస్ అధికార ప్రతినిధి పవన్ ఖేరా ఆరోపించారు. 2018-19లో అధికంగా రూ.19.54 కోట్ల లావాదేవీలు జరిగాయని తెలిపారు. చైనా పెట్టుబడులతో సహా విదేశీ ఫండ్స్‌ల్లోనూ బచ్‌కు పెట్టుబడులు ఉన్నట్లు ఆరోపించారు. గ్లోబల్ ఎక్స్ ఎంఎస్‌సీఐ చైనా కన్స్యూమర్, ఇన్వెస్కో చైనా టెక్నాలజీ ఈటీఎఫ్ వంటి నాలుగు అంతర్జాతీయ నిధుల్లో బచ్ పెట్టుబడులు పెట్టినట్లు ఖేరా తెలిపారు. ఈ విదేశీ ఆస్తులను బచ్ ఎప్పుడు ప్రకటిస్తారని ప్రశ్నించారు. ఈ పెట్టుబడుల గురించి ఏ ప్రభుత్వ సంస్థకు సమాచారం ఉందని అడిగారు. లిస్టెడ్ సెక్యూరిటీలో సెబీ చైర్‌పర్సన్ ట్రేడింగ్ చేస్తున్నట్లు ప్రధానికి తెలియదా అని నిలదీశారు. విదేశాల్లో బచ్‌కు అత్యధిక విలువ చేసే పెట్టుబడులు ఉన్నట్లు మోదీకి తెలుసా? ఇన్వెస్ట్‌మెంట్-డిస్‌క్లోజర్ తేదీలు ఏమిటో చెప్పగలరా? చైనా సంస్థల్లో బచ్ పెట్టుబడుల గురించి ప్రధానికి తెలియదా? అని పవన్ ఖేరా వరుస ప్రశ్నలు సంధించారు.

దేశం ఏపీ వైపు చూసేలా...

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభించారు. మొదటి ప్రయాణికుడు శ్రీకృష్ణకు ఆయన బుక్ చేసుకున్న టికెట్ అందించి శుభాకాంక్షలు తెలిపారు. విమానాశ్రయం ప్రవేశ మార్గంలోని రహదారి పక్కన మొక్కలు నాటారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. కేవలం మూడు నెలల వ్యవధిలోనే ఏపీ నుంచి ముఖ్య నగరాలకు 4 కొత్త సర్వీసులు ఏర్పాటు చేసుకున్నామన్నారు. అక్టోబరు 27న విశాఖ-దిల్లీకి మరో సర్వీసు ప్రారంభించనున్నట్లు చెప్పారు. షార్జాకు ప్రస్తుతం సర్వీసులు నడుస్తున్నాయని, త్వరలో దుబాయ్, సింగపూర్‌కు విస్తరించనున్నట్లు చెప్పారు. దేశం మొత్తం ఆంధ్ర ప్రదేశ్ వైపు చూసేలా ఎయిర్ కనెక్టివిటీ పెంపు కోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో విమాన ప్రయాణికుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని, భవిష్యత్‌లో మరింత పెంచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో విజయవాడ విమానాశ్రయం నుంచి నెలకు 85 వేల మంది రాకపోకలు సాగించగా, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ సంఖ్య లక్ష దాటిందని చెప్పారు. గత పదేళ్లలో 157 విమానాశ్రయాలను నిర్మించిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందన్నారు. దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని, ఎవరికి వారు తమ తల్లి పేరుతో మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. అక్టోబరు 26న విజయవాడ నుంచి పుణెకు కొత్త సర్వీసు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అలాగే ఏడాదిలోగా గన్నవరం విమానాశ్రయం కొత్త టెర్మినల్ ప్రారంభిస్తామని, దేశంలో కొత్తగా మరో 200 విమానాశ్రయాల ఏర్పాటు లక్ష్యంగా కృషి చేస్తున్నామని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీలు వల్లభనేని బాలశౌరి, యదువీర్ వడియార్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

కబ్జాకోరల్లో చెరువులు

(మొదటిపేజీ తరువాయి)

పక్కా భవనాలు ఏర్పాటు చేసుకున్నారు. గజ్జల వారి చెరువు (బుద్ధ పార్క్),పత్తే బాద చెరువు (బృందావనం పార్కు), పంపుల చెరువు లను షాపింగ్ కాంప్లెక్స్ గా మార్చాలని అప్పట్లో పాలకులు అనుకున్నారు. ప్రజల నుంచి ప్రతిఘటన రావడంతో వెనక్కి తగ్గారు. టూటౌన్ పరిధిలోని ముట్ల చెరువు, రజకుల చెరువు, కొత్తచెరువులలో ఎక్కువ భాగం ఆక్రమణదారుల కోరల్లో చిక్కి విలవిల లాడుతున్నాయి. వన్ టౌన్‌లో 4.23 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మోతే వారి చెరువులో ఎక్కువ భాగాన్ని ఎనిమిదేళ్ల క్రితం బండ రాళ్లు, మట్టి ,ఇసుకతో పూడ్చేశారు. మాంసం దుకాణాలకు కొంత స్థలాన్ని కేటాయించారు. గతంలో మోతే జమీందారులు ఈ చెరువులో తమ ఏనుగులను శుభ్రం చేసుకునేవారు. తదనంతర కాలంలో ఈ చెరువును చేపలు పెంపకానికి లీజుకి ఇచ్చారు. ప్రస్తుతం చెరువు చెరువు విస్తీర్ణం అర ఎకరం మించి ఉండదని చెప్పవచ్చు. వన్‌టౌన్ పరిధిలోని వెంకన్న చెరువు ఏళ్లనాటిది. ప్రజల దాహార్తిని తీర్చింది. సుమారు ఏడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు కొన్నాళ్లు చేపల పెంపకానికి లీజుకివ్వడంతో నగరపాలక సంస్థకు ఆదాయం తెచ్చి పెట్టింది. వెంకన్న చెరువును ఆనుకుని శ్మశాన వాటిక ఉండటమే చెరువుకు శాపంగా మారింది. ఈ రెండింటినీ రూ.ఐదు కోట్లతో ఆధునీకరించాలని 2015లో అప్పటి పాలకులు నిర్ణయించారు. ఏడు ఎకరాల చెరువును ఐదు ఎకరాల వరకు పూడ్చేయాలని అనుకున్నారు. అందుకు అనుగుణంగానే చెరువు చుట్టూ కంకర మట్టితో నింపేశారు. ప్రహరీని నిర్మించారు. పచ్చదనాన్ని పరిచి, శ్మశాన వాటికకు అనుబంధంగా స్నానాలు చేయడానికి , దహన వాటికలు, కాపలాదారు విశ్రాంతి గదులు నిర్మించాలని ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రజల నుంచి చందాలు వసూలు చేసి ఈ పనులు పూర్తి చేయాలని అనుకున్నారు. అయితే గడిచిన ఎనిమిదేళ్లలో ఏవీ కార్యరూపం దాల్చలేదు. ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో ఉండాల్సిన వెంకన్న చెరువు పూర్తిగా పిచ్చి చెట్లు, ముళ్ల కంప చెట్లతో నిండిపోయింది. మున్సిపల్ కార్మికులు ట్రాక్టర్లు, బండ్లతో తీసుకొచ్చిన చెత్తతో వెంకన్న చెరువును నింపేస్తున్నారు. డస్ట్ బిన్‌గా మార్చేశారు. బహిరంగ మలవిసర్జనకు, అసాంఘిక కార్యకలాపాలకు వెంకన్న చెరువు ప్రాంతాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి నీటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పాడుబడిన, పూడుకుపోయిన చెరువులను నీరు-చెట్టు కింద పునరుద్ధరించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. హైడ్రా తరహా చర్యలు తీసుకుని చెరువులను కాపాడకుంటే వరదలు వస్తే మరో విజయవాడ అవడం ఖాయం అంటున్నారు.

సీతారాం ఏచూరికి ఏపీయూడబ్ల్యూజే నివాళి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : పీడిత, తాడిత ప్రజల పక్షాన నిరంతరం అటు పార్లమెంటులోను, వెలుపలా గళమెత్తిన ప్రజా యోధుడు సీతారాం ఏచూరి అని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐవీ సుబ్బారావు, చందూ జనార్ధన్, సామ్నా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నల్లి ధర్మారావు, సిహెచ్ రమణారెడ్డి, ఐజేయూ సమితి సభ్యులు ఎస్.కె.బాబు, విజయవాడ అర్బన్ అధ్యక్ష, కార్యదర్శులు చావా రవి, దారం వెంకటేశ్వరరావు, విజయవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కె.జయరాజ్, దాసరి నాగరాజు ఒక ప్రకటనలో నివాళులర్పించారు. విజయవాడ ప్రెస్ క్లబ్‌తో ఆయనకు ఉన్న అనుబంధాన్ని యూనియన్ నాయకులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. సీతారాం ఏచూరి విజయవాడ వచ్చిన ప్రతి సందర్భంలోనూ విజయవాడ ప్రెస్ క్లబ్ మీట్ ది ప్రెస్ కార్యక్రమాల్లో పాల్గొని వివిధ అంశాలపై తన అభిప్రాయాలను, సమకాలీన రాజకీయాలపై తన విధానాలను స్పష్టంగా వెల్లడించారని వారు తెలిపారు. ఆయన మృతి రాజకీయ రంగానికి, ముఖ్యంగా వామపక్ష ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు.

జగన్ ఐదేళ్ల పాలనే రాష్ట్రానికి అతి పెద్ద విపత్తు

మంత్రి
నాదెండ్ల మనోహర్

విశాలాంధ్ర-మంగళగిరి: జగన్ చేసిన ఐదేళ్ల పాలనే రాష్ట్రానికి అతి పెద్ద విపత్తు అని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. వైసీపీ సృష్టించిన విపత్తు వలన పాలనా వ్యవస్థలు ధ్వంసం అయ్యాయని స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. గత 100 ఏళ్లలో ఎప్పుడూ లేని విధంగా వర్షపాతం నమోదు కావడంతోనే అనుకోని వరద వచ్చిందని, అప్పుడే బయటకు వచ్చిన జగన్ దీనిని మేన్ మేడ్ ఫ్లడ్ అనడం సమంజసం కాదని అన్నారు. వైసీపీ నాయకుడు గానీ, ఆ పార్టీ నాయకత్వం గానీ కనీసం క్షేత్రస్థాయిలోకి దిగి ఒక్క రూపాయి కూడా బాధితులకు సాయం చేయలేదని, అలాంటి వారు విపత్తు వేళ రాజకీయ విమర్శలు చేయడం ఆ పార్టీ నైజాన్ని చూపుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు క్షేత్రస్థాయి పర్యటనలు చేసి బాధితులకు భరోసాగా నిలిచారన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విపత్తు వేళ తన సొంత నిధులు రూ.4 కోట్లను వరదలో చిక్కుకున్న 400 పంచాయతీలకు ఇవ్వడమే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాలకు కోటి రూపాయల చొప్పున అందించారని తెలిపారు. ఏలేరు ఆధునీకీకరణకు ఉప ముఖ్యమంత్రి ఇప్పటికే రూ.వెయ్యి కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళికలు సిద్ధం చేయించారని చెప్పారు. వైసీపీ పాలనలో 2020 నుంచి రైతులకు పంట బీమాకు రూపాయి కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. ఆస్తి నష్టం మీద పూర్తిస్థాయిలో వివరంగా లెక్కలు స్వీకరించే పని జరుగుతోం దని, ఆటోలు, ద్విచక్ర వాహనాలు, వస్తువులు నష్టపోతే ఆ వివరాలూ నమోదు చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, జనసేన కార్యక్రమాల నిర్వహణ కమిటీ కన్వీనర్ కళ్యాణం శివశ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి మండలి రాజేష్ పాల్గొన్నారు.

వరద బాధితులకు ఏఐటీయూసీ బియ్యం పంపిణీ

విశాలాంధ్ర-విజయవాడ: బుడమేరు వరద బాధితులకు ఏఐటీయూసీ అధ్వర్యంలో బియ్యం పంపిణీ చేశారు. ఇటీవల భారీ వర్షాలతో బుడమేరు వాగు వరద విజయవాడ నగరాన్ని వరద ముంచెత్తింది. సర్వస్వం కోల్పోయిన పేద ప్రజలను గుర్తించి శనివారం గొల్లపూడిలోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో 15 కేజీల బియ్యం, దుప్పటి, పంచ, తువ్వాలు మొదలగునవి పంపిణీ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్, ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య అధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ పాలకుల నిర్లక్ష్యం వల్లే బుడమేరు పొంగిపొర్లి విజయవాడను అతలాకుతలం చేసిందన్నారు. ఎగున ఉన్న రాష్ట్రాలలో అధిక వర్షం కురిసి అన్ని డ్యామ్‌లు నిండి పొంగి పొర్లుతుండటంతో పాటు మన రాష్ట్రంలో తుపాను వస్తుందని హెచ్చరికలు చేసినప్పటికీ వరద వస్తుందని ముందుగానే పసికట్ట లేకపోయిన ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ఈ విపత్తు జరిగిందని తెలిపారు. అయితే వరదల్లో ప్రభుత్వం కొంతమేర అధికారులను కదిలించి ప్రజలు మరింత నష్టపోకుండా వారికి కొన్ని సౌకర్యాలు తక్షణం కల్పించినందుకు అభినందించారు. ఈ విపత్తు వల్ల పేద కార్మికులు, ప్రజలు, ముఖ్యంగా ఆటో కార్మికులు, హమాలీలు, వీధి విక్రయదారులు, భవన నిర్మాణ కార్మికులు, ఇతర కార్మికులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. దాదాపు 15 రోజులు పనులు లేక పస్తులు గడపవలసిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. వరద నీటిలోనే విద్యుత్ సరఫరా లేక తిండి, నీరు, పాలు అందక ప్రజలు చాలా బాధపడుతున్నారని తెలిపారు. ఇటువంటి వారికి కేవలం రూ.10 వేలు సహాయంతో బయటపడలేరని, ఒక్కొక్కరు లక్షలాది రూపాయల సామాన్లను నష్టపోయారని, కనీసం ప్రభుత్వం లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. భవిష్యత్‌లో ఇటువంటి విపత్తులు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మూడు నెలలు విద్యుత్ బిల్లులు, ఇంటి పన్నులు మొదలగునవి రద్దు చేసి బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. విజయవాడ నగరంలోని పేద కార్మికులకు సహాయం చేసినందుకు ఏఐటీయూసీ రాష్ట్ర సమితిని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షులు కె.ఆర్.ఆంజనేయులు, కార్యదర్శి మూలి సాంబశివరావు, పట్టణ నాయకులు కొట్టు రమణ, ఎన్.వీరభద్రరావు, పంచదార దుర్గాంబ, టి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుకు సొంత గనులు

వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): విశాఖ ఉక్కు కర్మాగారానికి ఉక్కు-బొగ్గు గనులు కేటాయించి... ప్రైవేటీకరణను నిలిపివేయాలని రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్ చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 32 మంది బలిదానంతో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పడిందని, విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో దీనిని సాధించుకున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు అమ్మకానికి వేగంగా అడుగులు వేస్తోందని, అందులో భాగంగా మూడు ఫర్నేస్‌లలో ఇప్పటికే రెండు మూసివేశారని ఆరోపించారు. తాజాగా మూడో ఫర్నేస్‌ను కూడా మూసివేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో కేటాయించిన గనులను కేబినెట్ సబ్ కమిటీ వెనక్కి తీసుకున్నట్లు టీడీపీ ఎంపీ రామ్మోహన్ నాయుడు అడిగిన ప్రశ్నకు పార్లమెంటులో కేంద్రం సమాధానం చెప్పిందని గుర్తు చేశారు. టాటా స్టీల్ కన్నా విశాఖ స్టీలు ఎక్కువ విలువ కలదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు 58 వేల కోట్ల రూపాయలు ఇప్పటికే చెల్లించిందని వివరించారు. రూ.17,500 కోట్లు మాత్రమే బ్యాంకు రుణాలు ఉన్నాయని, విశాఖ ఉక్కుకు కేంద్రం క్యాప్టివ్ మైన్స్ కేటాయించకపోవడం వలన ఈ అప్పు చేయాల్సి వచ్చిందని చెప్పారు. ఇనుప ఖనిజం, బొగ్గు గనులు కేటాయిస్తే రెండు, మూడు సంవత్సరాలలో అప్పులు తీరతాయని, మరలా లాభాల బాటలోకి వస్తుందని వడ్డే చెప్పారు. విశాఖ ఉక్కుపై కేంద్రం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని, దీనిని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి కంకణం కట్టుకుందని విమర్శించారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు 22 వేల ఎకరాల భూమి ఉందని, దీని విలువ రూ.2 లక్షల కోట్లు ఉంటుందని, కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కేవలం రూ.25 వేల కోట్లకే అమ్మివేయాలని చూస్తుందని మండిపడ్డారు. దానిలో శాశ్వత ఉద్యోగులు 12,800 మంది, 12000 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నారని, దీనిని ప్రైవేటీకరిస్తే వారంతా రోడ్డున పడతారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవ తీసుకొని విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయకుండా అడ్డుకోవాలని, సొంత గనులు కేటాయించి ఆదుకోవాలని కోరారు. సమావేశంలో మాజీ ఐఏఎస్ అధికారి బండ్ల శ్రీనివాస్, ఎస్ఆర్ఆర్ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపల్ లక్ష్మణరావు, సీఐటీయూ నాయకులు నర్సింగరావు పాల్గొన్నారు.

ఏఆర్ కానిస్టేబుల్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది: మంత్రి అనిత

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బందోబస్తు విధుల కోసం వచ్చిన అనంతపురం జిల్లాకు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ చంద్రానాయక్ గుండెపోటుతో మృతి చెందడం చాలా బాధాకరమని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. సహచర ఉద్యోగులు ఎంతో శ్రమించి సీపీఆర్ చేసి కాపాడాలని ప్రయత్నించినా ఏఆర్ కానిస్టేబుల్ చంద్రానాయక్ (పీసీ 3570) అకాలమరణం చెందడం అత్యంత విషాదకరమన్నారు. చంద్రా నాయక్ కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని మంత్రి అనిత స్పష్టం చేశారు. సమాచారం తెలిసిన నిమిషాల్లోనే స్వయంగా వెళ్లి ఆంధ్రా హాస్పిటల్‌లో కానిస్టేబుల్ చంద్రానాయక్ పార్థివదేహానికి హోం మంత్రి నివాళులర్పించారు. చంద్రానాయక్ కుటుంబ సభ్యులకు ఆమె తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కాగా, చిత్తూరు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంపై హోం మంత్రి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. డ్రైవర్ సహా అనేక మంది మృతి చెందడం శోచనీయమన్నారు.

బాధిత రైతులందరినీ ఆదుకోవాలి

ఈ క్రాప్ నమోదు గడువు పెంచాలి: కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం: వరద ధాటికి సకలం కోల్పోయిన రైతు కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. భారీ వర్షాలు, వరదలకు పశువుల మేత మొత్తం కొట్టుకుపోవడంతో మండలంలోని కొటికలపూడి గ్రామంలో రైతు కుటుంబాలకు రైతు సంఘం అధ్వర్యంలో పశువుల మేతను పంపిణీ చేశారు. శనివారం సాయంత్రం గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ పంట నష్టపోయిన విస్తీర్ణాన్ని ప్రభుత్వ అంచనా ప్రకారం వెల్లడించినప్పటికీ మరింత ఎక్కువ విస్తీర్ణం ఉన్నట్లుగా వెల్లడవుతుందని, ప్రభుత్వం క్షుణ్ణంగా పరిశీలన చేసి బాధిత రైతులందరినీ ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ క్రాప్ నమోదు గడువును పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం ఉపాధ్యక్షులు మల్నీడి యలమందరావు, ఏపీ కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం కార్యదర్శి వర్గ సభ్యులు సురేంద్రనాథ్ బెనర్జీ, సీపీఐ కృష్ణాజిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు, రైతు సంఘం సీనియర్ నాయకులు వి.ఆజాద్, రైతు సంఘం గ్రామ నాయకులు జోగలగడ్డ కోటేశ్వరరావు, ఎం.గోవిందరావు, పాగి శ్రీనివాసరావు, పి.నరసింహారావు, పల్లె శ్రీనివాసరావు, అనుమోలు వెంకటేశ్వరరావు, బాబురావు పాల్గొన్నారు.

ధీరవనిత మొల్ల

మైసూర్ మహారాజ యదువీర కృష్ణదత్త చామరాజ వడియార్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ (మొల్ల) ఒక ధీరవనిత అని మైసూర్ మహారాజ, ఎంపీ యదువీర కృష్ణదత్త చామరాజ వడియార్ కొనియాడారు. విజయవాడ తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో మొల్ల కాంస్య విగ్రహాన్ని ఆయన శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మైసూర్ మహారాజా మాట్లాడుతూ నాటి కాలంలో రాజుల ఆస్థానాల అండ లేకుండా ఒక్క కావ్యం రాయలేరని, కానీ మొల్ల ఏ రాజాస్థానం అండ లేకుండానే అచ్చతెలుగులో రామాయణం రచించి శ్రీరాముడికే అంకితమిచ్చారన్నారు. శ్రీకృష్ణదేవరాయల కాలం నుండి రెండు రాష్ట్రాల మధ్య మంచి మైత్రి కొనసాగు తోందన్నారు. మైసూర్ ఆస్థానంలో ఎందరో తెలుగు వారు వివిధ పదవులు అలంకరించారన్నారు. ఎన్నో శతాబ్దాల నుండి కన్నడ, ఆంధ్ర రాష్ట్రాలకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని గుర్తుచేశారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య తెలుగు సంతతి వాడని, ఆయన గురించి తెలియని భారతీయుడు ఉండడన్నారు. తెలుగు రాష్ట్రంలో శాలి వాహన సంఘం అభివృద్ధికి ఐలాపురం వెంకయ్య విశేష కృషి చేశాడని ప్రశంసించారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ మహా కవయిత్రి మొల్ల తొలి తెలుగు కవయిత్రి అని పేర్కొన్నారు. నన్నయ్య ఆదికవి అయితే ఆది కవయిత్రి మొల్ల అని కీర్తించారు. తెలుగు సాహిత్య చరిత్రలో రచయిత్రి మొల్లకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. రామాయణాన్ని అచ్చ తెలుగులో సామాన్యులకు అర్థమయ్యే రీతిలో అనువదించిన మహా కవయిత్రి అని అన్నారు. మొల్లను ఆదర్శంగా తీసుకుని బాలికలు ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షించారు. బాలికల చదువు దేశానికే వెలుగని కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. తెలుగు భాష గొప్పదని, అటువంటి తెలుగును భావితరాలకు అందించాలని ప్రతి ఒక్కరూ సంకల్పం చేసుకోవాలని కోరారు. మాతృభాషకు మొదటి ప్రాధాన్యత ఇచ్చినప్పుడే ఇది సాధ్యమవుతుందన్నారు. ప్రపంచదేశాల్లో ఇప్పటికీ మన తెలుగు సంస్కృతి, సంప్రదా యాలు నిలబడ్డాయంటే దానికి కారణం రామాయణం ఒక్కటే అని అన్నారు. చేతి వృత్తులు, కులవృత్తులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మొల్ల తెలుగు రచయిత కావడం మన అదృష్టమన్నారు. ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, కేఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, గద్దే రామ్మోహన్, యార్లగడ్డ వెంకట్రావు, శాలివాహన సంఘం ప్రముఖులు ప్రసంగించారు. అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర, అతిథులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

సంపద పునఃపంపిణీతోనే సంక్షేమ రాజ్యం

చర్చా గోష్ఠి సమన్వయకర్త డీవీవీఎస్ వర్మ

విశాలాంధ్ర-తణుకు: సంపద పునఃపంపిణీతోనే దేశంలోనూ, రాష్ట్రాలలోనూ సంక్షేమ రాజ్యం సాధ్యపడుతుందని, చర్చా గోష్ఠి సమన్వయకర్త, దారి దీపం సంపాదకులు డీవీవీఎస్ వర్మ అన్నారు. స్థానిక సురాజ్య భవనంలో శనివారం తణుకు స్టడీ సర్కిల్ చర్చా గోష్ఠి జరిగింది. అసమాన భారతంపై జరిగిన చర్చలో... ఆక్స్‌ఫామ్ నివేదికల ప్రకారం దేశంలో ఒక శాతం మంది వద్ద 46 శాతం దేశ సంపద ఉండగా, 10 శాతంగా వున్న బిలియనీర్లు, కార్పొరేట్లు, కుబేరుల వద్ద మొత్తం దేశ సంపదలో 77 శాతం సంపద ఉన్నట్టు వివిధ సంఘాల ప్రతినిధులు ప్రస్తావించారు. 10 ఏళ్ల మోదీ పాలనలో 35 శాతంగా ఉన్న కార్పొరేట్ పన్నును 22 శాతానికి తగ్గించారు... దాదాపు 20 లక్షల కోట్ల అప్పులు రద్దు చేశారు... గతంలో 10 శాతం ఉన్న వారసత్వ పన్నును పూర్తిగా తొలగించారని వారు వివరించారు. మరోపక్క జీఎస్టీ భారాన్ని ప్రజలపై మోపారని, ప్రత్యక్ష పన్నుల కంటే పరోక్ష పన్నులను అధికంగా విధిస్తూ పేదలు, సామాన్యుల నుంచి దండుకున్నారని విమర్శించారు. కుబేరుల దగ్గర పోగుపడ్డ సంపద పునః పంపిణీ నినాదంతో ప్రచారం జరగాలని అభిప్రాయపడ్డారు. ప్రత్యామ్నాయ రాజకీయాన్ని సంపద పునః పంపిణీ నినాదంతో ప్రజలకు స్వతంత్ర జీవనాన్ని ఇచ్చే నిర్దిష్టమైన ఎజెండాతో ప్రచారం ఐక్యంగా సాగించాలని తీర్మానించారు. ప్రత్యేక ఆహ్వానితులు ఎం.వెంకయ్య తన సందేశం ఇస్తూ ప్రత్యామ్నాయ రాజకీయ ప్రచారానికి అన్నిప్రాంతాలలోనూ ఇలాంటి చర్చా గోష్ఠులు జరగాలని, హైదరాబాదు, గుంటూరు పట్టణాల్లో తమ సంస్థ సదస్సులు నిర్వహించిందని మరికొన్ని చోట్ల త్వరలో నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. తొలుత డాక్టర్ రమేశ్ చంద్రబాబు... మృతి చెందిన సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, కమ్యూనిస్టు సీనియర్ నాయకులు ఆర్.యస్‌కు నివాళి అర్పించారు. సీపీఐ నేతలు కోనాల భీమారావు, బొద్దాని నాగరాజు, టీ అప్పలస్వామిగా, సీపీఎం నాయకులు పీవీ ప్రతాప్, గార రంగారావు, కాంగ్రెస్ నాయకులు రామారావు, రైతుకూలీ సంఘం నాయకులు బాషా, మోహన్, సామాజిక న్యాయపోరాట సమితి నాయకులు పేరూరి మురళీకుమార్ , అంబేద్కర్, మాల్యాద్రి స్టడీ సర్కిల్ సభ్యులు సంకు మనోరమ, ఆకుల వెంకటేశ్వరావు , న్యాయవాదులు పొట్ల సురేష్, కౌరు వెంకటేశ్వర్లు, ప్రజానాట్యమండలి నాయకులు ఎం. సీతారాం ప్రసాద్, ఏలూరు మిత్రులు పీపీ శాస్త్రి, అడబాల లక్ష్మి, తాడేపల్లిగూడెం నుంచి మందలపర్తి హరీశ్, వాసు, ఆదినారాయణ పాల్గొన్నారు.

కట్ట పుట్టాలమ్మ ఆలయ శిల్పాలు కాపాడుకోవాలి

ఈమని శివనాగిరెడ్డి

విశాలాంధ్ర-తిరుపతి: తిరుపతి సమీపంలోని కరకంబాడి కట్ట పుట్టాలమ్మ దేవాలయం ముందున్న మధ్య యుగ శిల్పాలను కాపాడుకోవాలని, పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా సీఈఓ డా.ఈమని శివనాగిరెడ్డి అన్నారు. ఎస్వీ భక్తి ఛానల్ సీనియర్ ప్రొడ్యూసర్, వారసత్వ ప్రేమికుడు బి.వి.రమణ ఇచ్చిన సమాచారం మేరకు ఆయన శనివారం ఈ శిల్పాలను పరిశీలించారు. ఆలయ మండపంలో కుడివైపున వీరభద్ర, అమ్మవారు, గణేశ శిల్పాలు ఎడమవైపున ఆత్మార్పణ వీరుడు, ద్వారపాల శిల్పాలు భూమిలో కూరుకుపోయి పసుపు రంగుతో నిండిపోయి ప్రాచీనత కోల్పోతున్నాయని తెలిపారు. ఆ విగ్రహాలను పైకి లేపి, రంగులు తొలగించి, పీఠాలపై నిలబెట్టాల్సిన అవసరం ఉందని కరకంబాడి ఆలయ నిర్వాహకులకు శివనాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు. విజయనగర అనంతర కాలం నుంచి బ్రిటీష్ కాలం వరకు కరకంబాడి-మామండురు-కృష్ణాపురం పాలెగాళ్లు అయిన నాయిని వంశీయులు కడప, నెల్లూరు, చెన్నపట్నం నుంచి తిరుపతికి వచ్చే భక్తులను అడవి జంతువులు, దొంగల నుంచి కాపాడే బాధ్యతలు నిర్వర్తించేవారని, ఆ పాలెగాళ్లే పుట్టాలమ్మ ఆలయాన్ని నిర్వహించేవారని ఆయన వివరించారు. ఈ శిల్పాలు కూడా అప్పటి నుంచి పూజలు అందుకుంటున్నట్లు బి.వి.రమణ చెప్పారు. 400 సంవత్సరాల చరిత్ర కలిగి, పురావస్తు ప్రాధాన్యత గల ఈ శిల్పాలను కాపాడుకొని భవిష్యత్ తరాలకు అందించాలని ఆలయ అధికారులను, గ్రామస్తులను శివనాగిరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ శిల్పి పెంచల ప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర శాసనమండలి నియోజకవర్గ అభ్యర్థిగా రఘువర్మ

విశాలాంధ్ర-పార్వతీపురం: 2025 మార్చిలో జరగనున్న ఉత్తరాంధ్ర శాసన మండలి ఎన్నికలకు నియో జకవర్గ అభ్యర్థిగా పాకలపాటి రఘువర్మ అభ్యర్థి త్వాన్ని ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర సంఘం ఏకగ్రీవంగా ఆమోదించి నందుకు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహేష్, బాలకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. 2019 నుంచి నేటి వరకు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసన మండలి సభ్యునిగా పాకలపాటి రఘువర్మ చేసిన కృషిని ఈ సందర్భంగా అభినందించారు. నేటి వరకు ఉత్తరాంధ్ర ఆరు జిల్లాల్లోని ఉపా ధ్యాయ, అధ్యాపక వర్గాన్ని అనుసరిస్తూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకున్న రఘువర్మ రానున్న ఎన్నికలలో విజయం వరించేలా సహకరించాలని ఉపాధ్యాయ, అధ్యాపక వర్గాన్ని అభ్యర్థిస్తున్నామని తెలిపారు.

17 నుంచి స్వచ్ఛతా హి సేవ: గంధం చంద్రుడు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్వచ్ఛ భారత్ దినోత్సవం సందర్భంగా సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 వరకు రాష్ట్ర వ్యాప్తంగా స్వచ్ఛతా హి సేవ 2024 నిర్వహిస్తున్నామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు తెలిపారు. మహాత్మా గాంధీ వారసత్వాన్ని గౌరవిస్తూ, స్వచ్ఛతను మన జీవన విధానంగా మార్చుకునేలా సమష్టిగా ముందడుగు వేయవలసిన అవశ్యకత ఉందన్నారు. రాష్ట్ర స్థాయిలో భాగస్వామ్య సంస్థలతో శనివారం హైబ్రీడ్ విధానంలో ఉన్నత స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంధం చంద్రుడు మాట్లాడుతూ స్వచ్ఛభారత్ మిషన్ పదో వార్షికోత్సవం, స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం ఏడు వసంతాలు పూర్తి చేసుకున్న తరుణంలో ఈ కార్యక్రమం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. మహాత్ముడి జయంతి వేళ ప్రతి సంవత్సరం అక్టోబరు 2న స్వచ్ఛ భారత్ దివస్‌గా పాటిస్తున్నామన్నారు. 'స్వభావ స్వచ్ఛత, సంస్కార స్వచ్ఛత' ఇతివృత్తంగా స్వచ్ఛతా హి సేవ 2024ను నిర్వహించుకుంటున్నామన్నారు. సమాజం మొత్తాన్ని భాగస్వాములను చేసేలా పక్షం రోజుల పాటు మూడు ప్రధాన అంశాలపై ఆధారపడి ఈ కార్యక్రమం కొనసాగుతుందని గంధం చంద్రుడు తెలిపారు. రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయని, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర స్థాయి నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందని ఆయన వివరించారు.

వృత్తి విద్య టీచర్లకు సమయ ప్రమాణం అమలు చేయాలి

విశాలాంధ్ర-విజయవాడ: పాఠశాల విద్య సమగ్రశిక్ష విభాగంలో ఆర్ట్, వర్క్, వ్యాయామ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న వృత్తి విద్యా ఉపాధ్యాయులకు కనిష్ట సమయ ప్రమాణం (మినిమం టైం స్కేల్) అమలు చేయాలని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఏపీ వర్క్, వ్యాయామ ఉపాధ్యాయుల ఐక్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సైకం శివకుమారి రెడ్డి, శంకర్‌రావు భాగవతుల డిమాండ్ చేశారు. రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్ భవనంలో శనివారం జరిగిన ఐక్య సంఘం కార్యనిర్వాక కమిటీ రాష్ట్ర స్థాయి సదస్సులో వారు మాట్లాడుతూ... పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఉన్నతాధికారుల సిఫారసుల మేరకు జీవో 73 ప్రకారం సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగులకు ఈఎస్ఐ, ఈపీఎఫ్‌లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్ట్స్, వర్క్‌లో విద్యార్థులలో నైపుణ్యం పెంపొందించేందుకు వృత్తి విద్యను ప్రోత్సహిం చడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. వృత్తి విద్యా ఉపాధ్యాయులుగా గుర్తించి ఎస్‌సీఈఆర్‌టీ ద్వారా వృత్తి విద్యకు ప్రత్యేక పాఠ్యాంశాన్ని రూపొందించి అమలు చేయాలని కోరారు. మండల, డివిజన్‌స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి సంఘం బలోపేతానికి రాష్ట్ర, జిల్లా నాయకత్వాలు కృషి చేయాలని బొప్పరాజు సూచించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజారావు, రాష్ట్ర కన్వీనర్లు ఎంపీ రమణ, జి.కామేశ్వరరావు, క్రమశిక్షణ కమిటీ నిర్వాహకులు శ్యాం సుందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

కువైట్ నుంచి మహిళ క్షేమంగా స్వదేశానికి...

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉపాధి కోసం కువైట్ వెళ్లి పని ప్రదేశంలో ఇబ్బందులు పడుతున్న అన్నమయ్య జిల్లా తంబేపల్లి మండలం నారాయణరెడ్డి పల్లి గ్రామానికి చెందిన తిరుపతి కవిత అనే మహిళ రాష్ట్ర ప్రభుత్వ చొరవతో క్షేమంగా స్వగ్రామానికి చేరింది. ఉపాధి కోసం ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి, ఆర్థికంగా నిలదొక్కుకునే ప్రయత్నంలో భాగంగా కువైట్ వెళ్లిన కవితకు పని ప్రదేశంలో అనేక ఇబ్బందులకు గురయినట్లు ఇటీవల సెల్ఫీ వీడియో ద్వారా తెలియజేశారు. దీనిపై రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పందించారు. తక్షణమే ప్రవాసంధ్రుల సాధికారత సంబంధాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు లేఖ రాశారు. కవితను తన స్వస్థలానికి సురక్షితంగా తీసుకురావాల్సిందిగా కోరారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెంటనే స్పందించి ఏపీ యన్ఆర్‌టీ అత్యవసర విభాగాన్ని అప్రమత్తం చేశారు. మంత్రి సూచనల మేరకు స్పందించిన ఏపీ ఎన్ఆర్‌టీ 24 గంటల అత్యవసర విభాగం కువైట్‌లో ఉన్న సామాజిక కార్యకర్త జిలకర మురళితో పాటు అక్కడే ఉన్న రషీదా బేగం అనే ప్రవాసాంధ్ర మహిళ ఇద్దరు కలిసి కవిత ఆశ్రయం పొందిన ప్రాంతానికి వెళ్లి, ఆమెను సురక్షితంగా దేశానికి తిరిగి పంపేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందించారు. శుక్రవారం రాత్రి కువైట్ నుంచి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో బయలుదేరిన కవిత శనివారం ఉదయం చెన్నై విమానాశ్రయానికి చేరుకుంది. అనంతరం అక్కడ నుంచి స్వగ్రామానికి చేరుకున్నారు. ఈ విషయంపై కవిత భర్త వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి తన భార్య విదేశాలకు వెళ్లిందని, ఆ పని ప్రదేశంలో అనేక ఇబ్బందులు ఎదురవడంతో తాను తిరిగి వస్తుందన్న నమ్మకాన్ని కోల్పోయాయని, చివరి ఆశగా ఆమె రాష్ట్ర మంత్రి రాంప్రసాద్ రెడ్డిని సంప్రదించడం, ఆయన తక్షణమే స్పందించి మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు విషయం తెలియజేసి 12 గంటలలోపే తన భార్యను దేశానికి తీసుకురావడం ఆనందించదగిన విషయమన్నారు.

సంపాదకీయం

సంఘ్‌కు మోదీ సంకటం

అటల్ బిహారీ వాజపేయి ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కన్నా చేవగల రాజకీయ నాయకుడు కావొచ్చు. వాజపేయి మూడుసార్లు ప్రధానిగా ఉన్నారు. అంతా కలిసి ఆరేళ్లే అన్నది వేరే విషయం. మొదటి సారి ఆయన్ని ఆ ప్రధాన మంత్రి అయినప్పుడు 13 రోజులే అధికారంలో ఉన్నారు. రెండవ సారి ప్రధానమంత్రి అయినప్పుడు 13 నెలలు అధికారంలో ఉన్నారు. ఆ తరవాత బీజేపీ తనంత తాను ప్రభుత్వాన్ని నిర్వహించేంతటి బలం పుంజుకోవడం కష్టం అని వాజపేయి, అద్వాణీ గ్రహించారు. అందుకే 370 వ అధికరణం రద్దు, ఉమ్మడి వివాహ చట్టం, అయోధ్యలో రామ మందిర నిర్మాణం లాంటి సంఘ్ పరివార్ ఆత్మకు ఇంపైన వివాదాస్పదమైన అంశాలను అటకెక్కించి మూడోసారి అయిదేళ్ల పూర్తికాలం ప్రధానిగా కొనసాగారు. దాదాపు 30కి పైగా చిన్నా చితకా పార్టీలను కూడగట్టి అయిదేళ్ల పదవీ కాలం పూర్తి చేయగలిగారు. వివాదాస్పద అంశాలను పక్కన పెట్టినందువల్లే ఇది సాధ్యమైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అలా కాదు. రెండో సారి 2009లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన తరవాత కాంగ్రెస్ అనేకానేక అవినీతి ఆరోపణలను ఎదుర్కోవలసి వచ్చింది. ఇది బీజేపీకి మంచి ప్రచారాస్త్రంగా ఉపకరించింది. 2013లోనే సంఘ్ పరివార్ నరేంద్ర మోదీని ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రకటించింది. ఆ తరవాత ఆయన దేశమంతా చుట్టబెట్టి కాంగ్రెస్ హయాంలోని అవినీతిని కూకటి వేళ్ల నుంచి పెకిలించి వేస్తానని భీకర ప్రతిజ్ఞ చేశారు. అనేకానేక హామీలు గుప్పించారు. అవినీతిని నిర్మూలించే వాగ్దానాన్ని వాటంగా కనుమరుగు చేశారు. తమది అవినీతికి తావులేని పార్టీ అని చెప్పుకున్న బీజేపీ, దాని తిరుగులేని నాయకుడు మోదీ తమ ఏలుబడిలో జరిగిన అవినీతి వ్యవహారాలను గంపకింద కమ్మేయగలిగారు. దీనికి సుప్రీంకోర్టు ఉద్దేశ పూర్వకంగానో, అనుద్దేశ పూర్వకంగానో సహకరించింది. రాఫెల్ మీద లోతైన దర్యాప్తు జరిపించడానికి నిరాకరించింది. ఇది మోదీ ప్రభుత్వం నెత్తిన పాలు పోసినట్టయింది. 2014లో 282 స్థానాలు సంపాదించిన బీజేపీ నాయకత్వంలోని బీజేపీ 2019 నాటికి బీజేపీ ఒంటరిగా 303 సీట్లు సంపాదించగలిగింది. అక్కడి నుంచి మోదీ తిరుగులేని నాయకుడన్న ప్రచారం జరిగింది.

ఈ నేపథ్యంలోనే మోదీ సంఘ్ పరివార్ అంతిమ లక్ష్యాలైన అయోధ్యలో రామ మందిర నిర్మాణం, ముమ్మారు తలాఖ్ వ్యవహారానికి వ్యతిరేకంగా చట్టం చేయడం, 370వ అధికరణం రద్దు లాంటివి అమలు చేయగలిగారు. ఇక మిగిలిందల్లా ఉమ్మడి వివాహ చట్టం తీసుకు రావడమే. అయినా 2024 ఎన్నికల తరవాత ఆర్.ఎస్.ఎస్. అధినాయకులకు మోదీ వ్యవహారం నచ్చడం లేదు. దీనికి మోదీ వ్యవహారసరళి చాలా వరకు కారణం. 2024 ఎన్నికల ప్రచారక్రమంలో "మా తల్లి బతికి ఉన్నన్నాళ్లూ నేను మా అమ్మ కడుపున పుట్టాననుకున్నాను. కానీ నిజానికి దైవాంశ సంభూతుడిని. కొన్ని లక్ష్యాలు సాధించడం కోసం ఆ భగవంతుడే నన్ను ఈ లోకానికి పంపాడు" లాంటి అహంకార పూరిత ప్రకటనలు చేశారు. ఈ క్రమంలోనే బీజేపీకి ఆర్.ఎస్.ఎస్.తో అంత పని లేదు అని ఆ పార్టీ అధ్యక్షుడు జె.పి.నడ్డా అన్నారు. ఇది ఆయన బుర్రకు తోచిన మాటో లేక మోదీ అహంకారాన్ని చూసి తానూ అహంకారం ప్రదర్శించగలనన్న ధీమావల్లో తెలియదు కానీ ఆర్.ఎస్.ఎస్.కు ఈ మాటలు నచ్చలేదు. ఆర్.ఎస్.ఎస్. అధినేత ఇప్పటికి మూడుసార్లు మోదీ మీద అన్యాపదేశంగా విమర్శలు గుప్పించారు. భగవత్ తరవాతి స్థానంలో ఉన్న దత్తాత్రేయహోసబొలే కూడా మోదీ మీద నర్మగర్భంగా కారాలు మిరియాలు నూరారు. ఇటీవల కేరళలోని పాలక్కడ్‌లో ఆర్.ఎస్.ఎస్. మేధోమథన సమావేశం జరిగింది. దానికి జె.పి. నడ్డా కూడా హాజరయ్యారు. ఆ సమావేశంలో పదవీ కాలం ముగిసిన నడ్డా స్థానంలో ఎవరిని నియమించాలన్న అంశం మీద ఒక నిర్ణయానికి వచ్చినట్టు లేదు. కానీ మోదీని ఉద్దేశించి మోహన్ భగవత్ ఘాటైన విమర్శే చేశారు. వ్యక్తి వాదం, ఒక్కరి చేతిలోనే సర్వాధికారాలు కేంద్రీకృతమై ఉండడం కుదరదు అని భగవత్ అన్నారు. ఆర్.ఎస్.ఎస్.తో బీజేపీకి అవసరంలేదు అన్న నడ్డా వ్యాఖ్యలు, మోదీ అహంకారపూరిత ధోరణివల్ల 2024 ఎన్నికలలో ఆర్.ఎస్.ఎస్. కార్యకర్తలు అంత ఉత్సాహంగా పాల్గొనలేదు. అందుకే బీజేపీ 240 స్థానాలతో సరిపుచ్చుకోవాల్సి వచ్చింది. తాము 400 కన్నా ఎక్కువ సీట్లు సాధిస్తామన్న మోదీ నినాదం సంఘ్ పరివార్ నేతలకే నచ్చినట్టు లేదు. ఒక్కో ఎన్నికల దశ గడుస్తున్న కొద్దీ జనం వాలకం మోదీకి అర్థమైంది. అందుకే 400 కన్నా ఎక్కువ సీట్లు సాధిస్తామన్న నినాదాలు వినిపించలేదు. సంఘ్ పరివార్ అధినేత మోహన్ భగవత్ అన్యాపదేశంగానే అయినా బహిరంగంగానే మోదీ వ్యవహార సరళి మీద పెదవి విరిచిన మాట నిజమే. కానీ ఆర్.ఎస్.ఎస్. బీజేపీని పరిత్యజించలేదు. అలాగే బీజేపీకి ఆర్.ఎస్.ఎస్. గోడ దాపు లేకపోతే క్షణం గడవదు. ఇది ఆ రెండింటిమధ్య ఉన్న విడదీయరాని బంధం. మోదీ మీద ఆర్.ఎస్.ఎస్.కు ఉన్న అభిప్రాయం ఎలాంటిదైనా కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలని ఎన్నటికీ సంఘ్ పరివార్ కోరుకోదు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇప్పటిదాకా మోదీ అమలుచేసిన సంఘ్ పరివార్ ఎజెండాను తిరగతోడతారన్న తెలివిడి సంఘ్ అధినేతలకు లేక పోలేదు. ప్రభుత్వంలో కీలక స్థానాల్లో సంఘ్ సిద్ధాంత భూమిక ఉన్న వారిని కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉండనివ్వరనీ మోహన్ భగవత్‌కు తెలియక కాదు. మోదీ ఆర్.ఎస్.ఎస్. ప్రేరణ అంతగా లేకపోయినా క్రమశిక్షణ గల ప్రచారక్‌గా సంఘ్ ఎజెండాను అమలు చేస్తూనే ఉన్నారు. వివాదాస్పద అంశాలను పక్కన పెట్టడం లాంటి బాదర బందీలు మోదీకి లేవు. వాజపేయికి ఉన్న శృంఖలాలూ మోదీకి లేవు. వాజపేయి నాయకత్వంలో ఎన్.డి.ఎ. ప్రభుత్వం కొనసాగిన రోజుల్లో ఆర్.ఎస్.ఎస్. అధినేతలు వాజపేయిని, అద్వాణీని కూడా పిలిపించి తమ అభిప్రాయం తెలియజేయగలిగే వారు. కానీ మోదీ ఆర్.ఎస్.ఎస్. నేతలకు ఆ అవకాశం ఇవ్వనవసరంలేని స్థాయికి ఎదిగిపోయారు. బీజేపీ మనుగడకు ఆర్.ఎస్.ఎస్. అవసరం ఎంత ఉందో మోదీకి స్పష్టంగా తెలుసు. కానీ తాను సంఘ్ ఎజెండానే అమలు చేస్తున్నప్పుడు ఇక వారి సలహాలు ఎందుకు అన్న అహంకార పూరిత ధోరణి అనుసరిస్తున్నారు. భగవత్‌కు మోదీతో సరిపడడంలేదన్న వాస్తవాన్ని ఆర్.ఎస్.ఎస్. అధినేతలు దాచుకోవడమూ లేదు. పాలక్కడ్ సమావేశం తరవాత "ఇది మా కుటుంబ వ్యవహారం. దీన్ని పరిష్కరించుకుంటాం" అని ఆర్.ఎస్.ఎస్. అధికార ప్రతినిధి తెలియజేశారు. ఇంటి గుట్టు బజారుకెక్కడం ఆర్.ఎస్.ఎస్. నాయకులకు ఇష్టం లేదు. మొత్తం మీద మోదీ వ్యవహార సరళి ఆర్.ఎస్.ఎస్.కు నచ్చడం లేదు.

దేశ రాజకీయాలలో ఏచూరి పాత్ర కీలకం

సురవరం సుధాకరరెడ్డి

కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం చాలా బాధ కలిగించింది. ఆయన వామపక్ష ఉద్యమంలో సీపీఎంలో ఒక ముఖ్యమైన నాయకుడిగా ఉండేవారు. వామపక్షాలు, ఇతర ప్రతిపక్ష సెక్యులర్ పార్టీల మధ్య చాలా సానుకూలంగా వ్యవహరించేవారు. ప్రతిపక్ష రాజకీయ పార్టీలు మతోన్మాదానికి వ్యతిరేకంగా వివిధ సందర్భాలలో కలిసి చర్చలు చేసుకునే సందర్భాల్లో ఆయన మంచి సలహాలు ఇవ్వడమే కాకుండా, కాంగ్రెస్ నాయకులు కూడా సమావేశం ప్రధానమైన అంశాలను ఒక స్టేట్‌మెంట్‌గా తయారు చేయాల్సివుంటే, దానికి బాధ్యత సీతారాం ఏచూరికే అప్పగించేవారు. ఆయన చాలా వేగంగా ఈ బాధ్యతలను నెరవేర్చడంతోపాటు మంచి డాక్యుమెంటు తయారు చేసేవారు.

సీతారాం ఏచూరి మంచి స్నేహశీలి. ఆయన హైదరాబాదులో చదువుకున్నప్పుడు నిజాం కాలేజీలో ఆయనకు అనేకమంది మిత్రులు ఉండేవారు. హైదరాబాద్ పార్టీ సమావేశాలకు వచ్చినప్పుడు, కొంత సమయం దొరికితే ఆ మిత్రులను కలుసుకునేందుకు ప్రయత్నించేవారు. నేను పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి నుంచి రిలీవై, అనారోగ్యం కారణంగా గత కొంతకాలంగా హైదరాబాదులో ఉంటున్నాను. అప్పటి నుంచి ఆయన హైదరాబాద్ వచ్చినప్పుడు నాతో ఫోన్‌లో మాట్లాడేవారు. ఆయనకు కొంత సమయం ఉంటే ఇంటికి వచ్చి, ఒక అరగంట సేపు దేశ రాజకీయాలు, ఇతర అంశాలు అన్నింటి గురించి కూడా మాట్లాడుకునేవాళ్లం. ఆయన మంచి స్నేహశీలి. ఆయన మిత్రులు జార్జి రెడ్డి సోదరుడు సిరిల్ రెడ్డి ఉండేవారు. ఆయన భార్య గీత రామస్వామి హైదరాబాద్ బుక్‌హౌస్ నడిపేది. సిరిల్ మొదట ఇంజినీరింగ్ పూర్తి చేసి న్యాయవాదిగా ఉండేవాడు. ఆయన అనారోగ్యంతో శ్వాసకోశ వ్యాధులతో ఇంట్లోనే ఉండేవారు. సీతారాం ఏచూరి వచ్చినప్పుడు ఆయన్ని కూడా కలిసి మాట్లాడి కొంత స్వాంతన కలిగించేవారు. ఇంకొంత మంది మిత్రులు గిరీష్ సంఘి రాజ్యసభ సభ్యులుగా ఉండేవారు. వారిద్దరూ కూడా బహుశా నిజాం కాలేజీలో క్లాస్‌మేట్స్. వారితో కూడా ఫోన్లో మాట్లాడేవారు. ఆయన, నేను పార్లమెంటులో కలిసి పనిచేసేవారం. ఆయన 2005లో రాజ్యసభకు ఎన్నికయ్యారు. నేను 2004లో 14వ లోక్‌సభ సభ్యుడిగా ఉన్నాను. వామపక్షపార్టీల మధ్య సమన్వయం కోసం మేము తరచుగా కలిసేవారం. పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో ఉభయసభల సభ్యులు, మాజీ సభ్యులు, మాజీ గవర్నర్లు, జర్నలిస్టులు కలిసి కూర్చొని మాట్లాడే ఒక విశాలమైన వేదికగా ఉండేది. సభలోంచి బయటకు వచ్చినప్పుడు అక్కడ చాలాసార్లు నేను ఆయనతో చర్చించేవాడిని.

సీతారాం ఏచూరి స్వతహాగా సానుకూల అభిప్రాయాలు కలిగినటువంటి వ్యక్తి. కొన్ని సందర్భాల్లో మా పార్టీల మధ్య కొన్ని అభిప్రాయ భేదాలున్నా , మేము ఆ విషయాలు చాలా స్పష్టంగా ఎవరి అభిప్రాయాలు వాళ్లు చెప్పుకునే వారం. ఆయన ఏమి మనసులో పెట్టుకునే వ్యక్తి కాదు. కామ్రేడ్ ఏబీ బర్దన్ ఆయన్ను చాలా ఆప్యాయంగా చూసేవారు. సీతారాం ఏచూరి అఖిలపక్ష సమావేశాల్లో ఈ రకంగా స్నేహశీలిగా ఉండేవారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వామపక్షాలు బయట నుంచి బలపరుస్తున్నా అనేక సమస్యల మీద వారితో విభేదించేవారం. ఆ సమస్యలను సున్నితంగా పరిష్కరించేవారు. వాస్తవానికి, 2004లో వామపక్షపార్టీలు కాంగ్రెస్ పార్టీని బలపరచాలని, దానికి కనీసం ఉమ్మడి కార్యక్రమం(సీఎంపీ) ఉండాలని వామపక్షాలు పట్టుపట్టాయి. ఆ రకమైన సీఎంపీ తయారు చేయడంలో ఇతర కామ్రేడ్స్ కూడా పాల్గొన్నారు. ప్రధానమైన బాధ్యత కామ్రేడ్ సీతారాం తీసుకున్నారు. దానిలో ఒక భాగంగానే సమాచార హక్కు చట్టం, కనీస ఉమ్మడి కార్యక్రమం (సీఎంపీ)లో చేర్చారు. అటవీ హక్కుల రక్షణ చట్టం కూడా దానిలోనే ఉంది. గృహహింస చట్టం, గ్రామీణ ఉపాధి హామీ చట్టం కూడా కనీస ఉమ్మడి

కార్యక్రమంలో భాగంగా ఉన్నాయి. ఈ ప్రతిపాదనలన్నీ తయారు చేసిన తర్వాత, తిరిగి వామపక్షాలు కలిసి కూర్చుని చర్చించి, దానిని కేంద్ర ప్రభుత్వానికి, ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇచ్చారు. దీనివల్ల కాంగ్రెస్ పార్టీ చాలా లాభం పొందింది. ఈ చట్టాలన్నీ కమ్యూనిస్టు పార్టీలు, వామపక్ష మద్దతు వల్ల వచ్చినప్పటికీ ఇవన్నీ కాంగ్రెస్ పార్టీ చేసిందని ఒక వాతావరణం ఏర్పడింది. ముఖ్యంగా గ్రామీణ ఉపాధి హామీ చట్టం, ఇది గ్రామీణ వ్యవసాయ కార్మికులకు చాలా పెద్ద ఎత్తున సహాయపడిన చట్టం. ఈ అంశాల మీద ఆయన చేసిన కృషి నాకు ఇప్పటికీ గుర్తు ఉంది. దానిపైన ఒక స్టాండింగ్ కమిటీ వేశారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కల్యాణ్ సింగ్ అధ్యక్షులు. ఒక ప్రతిష్టంభన ఏర్పడి, భారతీయ జనతా పార్టీ సమావేశాలకు రాకుండా, స్టాండింగ్ కమిటీ సమావేశాలు జరగకుండా ఆపింది. అందులో నేను, మధు (సీపీఎం నాయకులు) సభ్యులుగా ఉన్నాం. ఈ అంశాలను నేను సీతారాం ఏచూరితో సంప్రదించాను. ఆయన, "ముందు స్పీకర్‌ను కలవండి, ఆయన ఏం చెప్తారో చూడండి," అన్నారు. స్పీకర్‌ను కలిశాం. "మీరు వాళ్లతో మాట్లాడాలి. నేను దీనిపైన ఆదేశాలు ఇవ్వలేను," అని స్పీకర్ సానుభూతి వ్యక్తం చేశారు. తన పరిమితులు తెలియజేశారు. గురుదాస్ దాస్‌గుప్తా, నేను ఇద్దరం కల్యాణ్ సింగ్, ఆ తర్వాత లోక్‌సభలో ఆ పార్టీ నాయకులు అద్వాణీని కలిశాం. ఇది ముఖ్యమైన చట్టమని, ఈ సమావేశాలు జరగాలని ఆయన కోరారు. ఈలోగా వారి ప్రతిస్పందన కూడా

తగ్గింది. తద్వారా, మళ్లీ ఈ సమావేశాలు జరగటం, గ్రామీణ ఉపాధి హామీ చట్టం, కోట్లాది మంది వ్యవసాయ కార్మికులకు ఉపాధి కల్పించే చట్టం వచ్చింది. ఇలాగే కొన్ని ముఖ్యమైన సమస్యల పైన చాలా విశ్వసనీయంగా వారు పార్లమెంట్‌లో సమస్యలను లేవనెత్తేవారు. ఆయన ఉపన్యాసాలు, ఆయన లేవనెత్తిన సమస్యలు, వీటిని పార్లమెంటు సభ్యులు చాలా జాగ్రత్తగా వినేవారు. రాజ్యసభలో ఆయన, లోక్‌సభలో గురుదాస్ దాస్ గుప్తా ఈ ఇద్దరు వాస్తవానికి ఒకవైపు ప్రభుత్వాన్ని సమర్థిస్తూనే, మరోవైపు ఆ ప్రభుత్వ తప్పులు, బలహీనతలను విమర్శించేవారు. ఈ సందర్భంగా ఒకసారి పార్లమెంట్ సెంట్రల్ హాల్లో మేము కూర్చొని మాట్లాడుతుండగా, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రాజ్యసభ సభ్యులు జయరాం రమేశ్ వచ్చి , "మీరు మా పార్టీ ప్రభుత్వాన్ని బలపరిచే వారా, లేదా మమ్మల్ని విమర్శించే ప్రతిపక్షం పార్టీ వారా?" అని అడిగారు. మేము, "రెండు చేస్తున్నాం. మీ ప్రభుత్వం బలపరిచే మంచి పనులను సానుకూలమైన పద్ధతిలో మేం బలపరుస్తున్నాం. మీ ప్రభుత్వం చేసేటువంటి ప్రజా వ్యతిరేక విధానాలను మేము తప్పనిసరిగా వ్యతిరేకిస్తాం," అని చెప్పాం. ఆ రకమైన పద్ధతిలో విమర్శలు ఉండేవి. అనేక అంశాల మీద అధికార పార్టీతో చర్చలు జరిగిన సందర్భాల్లో మేము కలిసేవారం. ప్రతిపక్ష సమావేశాలతోపాటు వామపక్ష సమావేశాలు కూడా జరిగేవి. సీపీఐ, సీపీఎం, ఫార్వర్డ్ బ్లాక్, ఆర్.ఎస్.పి - ఈ నాలుగు పార్టీల పార్లమెంటు సభ్యులు ఉండేవారు. మొత్తం వామపక్షాలు దాదాపు 64 మంది పార్లమెంటు సభ్యులు ఉండేవారు. అందువల్ల వామపక్షాల ప్రతిపాదనలు, వారి సలహాలు ప్రభుత్వం చాలా సీరియస్‌గానే తీసుకునేది. ఈ రకమైన విభిన్న సందర్భాలలో తెలుసుకోవడమే కాకుండా, పార్టీ ప్రధాన కార్యదర్శి బాధ్యతలు స్వీకరించిన తర్వాత సీపీఐ, సీపీఎం సమావేశాలు, వామపక్షాల సమావేశాలు చాలాసార్లు జరిగాయి. ఐక్య కార్యాచరణ కొన్ని అంశాల మీద మేము కలిసి ప్రకటనలు చేయటం జరిగేవి. వామపక్షాల ఐక్య కార్యాచరణే కాక, కమ్యూనిస్టు ఉద్యమ పునరైక్యత గురించి నేను చాలాసార్లు సీపీఎం నాయకులతో, ముఖ్యంగా సీతారాం ఏచూరితో చర్చించాను. అంతకుముందు వారు కొంచెం దీనికి దూరంగా ఉండేవారు. రాను రాను కొన్ని సంవత్సరాల తర్వాత ఈ అంశం మీద కొంచెం సానుకూలమైన వైఖరి తీసుకునేవారు. కొన్ని అభిప్రాయభేదాలు ఉండేవి. ప్రణబ్ ముఖర్జీని భారత రాష్ట్రపతిగా ప్రతిపాదన చేసినప్పుడు, సీపీఎం బలపరచాలని నిర్ణయించింది. సీపీఐ, ఆర్.ఎస్.పి వ్యతిరేకించాయి. ఆర్థిక విధానాల్లో ఆయనదే ప్రధాన బాధ్యత కాబట్టి, మేము బలపరచబోమని చెప్పాం. ఆ అంశాలమీద అభిప్రాయభేదాలు ఉన్నా, వారి పద్ధతిలో వారు మాట్లాడుకునేవారు. నిర్ణయం చేసుకునేవారు. ఆయన చాలా సులభంగా "లెటజ్ అగ్రి టు డిసగ్రీ" అని చెప్పి, ఆ సమస్యను తేలికగా తీసుకునేవారు. కమ్యూనిస్టు ఉద్యమ పునరైక్యత గురించి ఆయన ముందుగా, "మన పార్టీల ప్రజా సంఘాలు, పార్టీల ఐక్య కార్యాచరణ ఇవి పెరగాలి. రెండు పార్టీలు కింది దాకా కలిసి కార్యాచరణ సాగిస్తుంటే, అలాంటి వాతావరణం రావొచ్చు" అని చెప్పి ఆయన సానుకూల అభిప్రాయాన్ని తెలియజేసేవారు.

వామపక్షాల ఐక్య కార్యాచరణే కాక, కమ్యూనిస్టు ఉద్యమ పునరైక్యత గురించి నేను చాలాసార్లు సీపీఎం నాయకులతో, ముఖ్యంగా సీతారాం ఏచూరితో చర్చించాను. అంతకుముందు వారు కొంచెం దీనికి దూరంగా ఉండేవారు. రాను రాను కొన్ని సంవత్సరాల తర్వాత ఈ అంశం మీద కొంచెం సానుకూలమైన వైఖరి తీసుకునేవారు.

హిందుత్వ మతోన్మాదాలని ఆయన తీవ్రంగా వ్యతిరేకించేవారు. దానిపైన చాలా ఘాటైన ఉత్తరాలు రాసేవారు. ఉపన్యాసాలు ఇచ్చేవారు. పుస్తకాలు కూడా రాశారు. సెక్యులరిజం ఆవశ్యకతను వివరించేవారు. నేను, ఆయన ఇద్దరం చైనాలో సిల్క్ సమావేశానికి వెళ్లాం. బీజేపీ ఈ సిల్క్ రూట్ పునరుద్ధరణను వ్యతిరేకిస్తున్నది. ఆ సందర్భంగా దీని నేపథ్యం ఏమిటి అనేది మేము చర్చించడానికి ప్రయత్నం చేశాం. సీతారాం ఏచూరి చొరవతో చైనాలో భారత రాయబారి కార్యాలయంలో దీనిపై చర్చ జరిగింది. మమ్మల్ని అందరినీ ఆహ్వానించి, భారత రాయబారి మాకు ఉన్న సమస్యలు, సానుకూలతలపై వివరణ ఇచ్చారు. ఇలాంటి అంశాల మీద సీతారాంకు చాలా లోతైన అవగాహన ఉంది. వామపక్షాల్లో సీపీఎం ఒక పెద్ద పార్టీ కాబట్టి, వారి పార్టీ కార్యాలయంలోనే సమావేశాలు జరుగుతుండేవి. మా పార్టీ కార్యాలయంలో కూడా ఇవి జరగాలని మేము ప్రతిపాదన చేస్తే, వారు స్వీకరించి మా పార్టీ కార్యాలయంలో సమావేశాలు ఏర్పాటు చేసేవారు. అలాగే, దానిని ఇంకా విశదీకరించేవారు. విస్తృతం చేసేందుకు సీపీఐ ఎంఎల్ పార్టీని, న్యూ డెమోక్రసీ పార్టీని ఆహ్వానించాలని నిర్ణయం చేశారు. ఈ రకమైన పరిస్థితుల్లో, కమ్యూనిస్టు పార్టీల అంతర్జాతీయ సమావేశంలో కూడా భారతదేశ రాజకీయ పరిస్థితులను ఆయన చక్కగా వివరించేవారు. సీపీఐ, సీపీఎం కలిపి దిల్లీలో ఒక అంతర్జాతీయ కమ్యూనిస్టు పార్టీల సమావేశాన్ని ఏర్పాటు చేశాయి. సమావేశం మూడు రోజులపాటు జరిగిన తర్వాత, మౌలాంకర్ హాల్‌లో జరిగిన సభలో సీతారాం ఏచూరి చాలా చక్కటి ఉపన్యాసం ఇచ్చారు. ఆయన విభిన్న భాషల్లో అనర్గళంగా మాట్లాడేవారు మలయాళం కొంత అర్థం చేసుకునేవాడు.

దేశంలో గత కొద్ది కాలంగా హిందుత్వ మతోన్మాదం బాగా పెరిగి, మైనార్టీలకు వ్యతిరేకంగా ఒక తీవ్రమైన భయోపాతాన్ని సృష్టిస్తున్న సందర్భంలో, వామపక్షాలతో పాటు ఇతర సెక్యులర్ పార్టీలను కలుపుకొని వచ్చేందుకు వామపక్షాలు చేసిన ప్రయత్నంలో సీతారాం ఏచూరి పాత్ర చాలా ముఖ్యమైనది. ఆయన స్నేహశీలి అయినప్పటికీ, సమస్యల మీద నిర్మాణాత్మకంగా మాట్లాడేవారు. మొట్టమొదటిసారి నరేంద్రమోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత ఒక అఖిలపక్ష సమావేశం పార్లమెంటులో ఏర్పాటు చేశారు. ఆ సమావేశంలో ఆయన, నేను, ఇతర వామపక్షాల వారం పాల్గొన్నాం. ఆయన తన ఉపన్యాసాన్ని రాసి టైప్ చేసి అందరికీ అందజేశారు. ఆ సమావేశంలో మేమిద్దరం కూడా దేశంలో ఒకేసారి ఎన్నికలు జరపాలనే అంశాన్ని తీవ్రంగా వ్యతిరేకించాం. "వన్ నేషన్, వన్ టాక్స్" అని జీఎస్టీ, "వన్ నేషన్, వన్ సివిల్ కోర్టు" అని, అలాంటి అంశాలతో పాటు "వన్ నేషన్, వన్ పార్టీ, వన్ నేషన్, వన్ లీడర్" అనే ప్రమాదకరమైన పరిస్థితుల్లోకి దేశాన్ని నెట్టుతున్నారని చాలా స్పష్టంగా మేమిద్దరం చెప్పాం. సీతారాం ఈ అంశాలను పార్లమెంటులో కూడా లేవనెత్తి, చాలా బలంగా తన ఉపన్యాసాల ద్వారా వివరించగలిగారు. ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న తీవ్ర రాజకీయ పరిస్థితుల్లో ప్రతిపక్ష పార్టీలు బలం పుంజుకున్నప్పటికీ, అధికారంలో ఉన్న సంఘ్‌పరివార్ విభాగం బీజేపీ మతోన్మాదాన్ని మరింత తీవ్రంగా రెచ్చగొట్టి, ప్రజలను చీల్చి వారే అధికారంలో కొనసాగాలనే ప్రయత్నం చేస్తున్నారు. అనేక ప్రజా వ్యతిరేక చట్టాలు, కార్మిక వ్యతిరేక చట్టాలు, రైతాంగ వ్యతిరేక చట్టాలు, మైనార్టీ వ్యతిరేక చట్టాలు వీటన్నిటిని తీసుకొస్తున్న నేపథ్యంలో సీతారాం ఏచూరి వంటి ఒక సమర్థుడైన నాయకుడు, ఈ దేశంలో ప్రతిపక్షాల తరపున పోరాటం చేయగలిగిన నాయకుడు ఉండటం చాలా అవసరం. అటువంటి సమయంలో ఆయన అనారోగ్యంతో మరణించడం చాలా బాధాకరం. ఉత్తమ పార్లమెంటే రియన్‌గా భారత పార్లమెంట్ ఆయనకు బిరుదు ఇచ్చింది. వాస్తవానికి, నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిపక్షపార్టీలకు ఇలాంటి బిరుదు ఇవ్వడం చాలా అరుదు. ఈ రకమైన అరుదైన గౌరవాన్ని సీతారాం ఏచూరి పొందారు. భారత రాజకీయాల్లో ఆయన పాత్ర ప్రజలు మర్చిపోరు. అనుకున్న లక్ష్యాల మేరకు ఆయన ఆదర్శాలు, నిరాడంబర జీవితం, సిద్ధాంత నిబద్ధత, స్పష్టత కలిగిన రాజకీయాలు, వీటిని యువతరం కొనసాగించాల్సిన అవసరం ఉంది. వ్యక్తిగతంగా ఒక మంచి మిత్రుని కోల్పోవడమే కాక, ఒక మంచి వామపక్ష నాయకుడిని కోల్పోవటం చాలా బాధాకరమైన విషయం. ఈ సందర్భంగా ఒకటి, రెండు ఆసక్తికర ఘటనలు కూడా చెప్పాలి. కామ్రేడ్ ప్రకాశ్ కారత్, సీతారాం ఏచూరి ఇద్దరూ కూడా దిల్లీలో జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ విద్యార్థులుగా అనేకమంది వారి సహచరులతో సంబంధాలు, స్నేహ సంబంధాలు ఉండేవి. అందులో చాలామంది ఐఏఎస్ అధికార్లు కూడా ఉండేవారు. వారితో చాలా చనువుగా మాట్లాడుతుండేవారు.

సీతారాం ఏచూరి హైదరాబాదులో సీపీఎం వారి పత్రిక సమావేశం ఒకటి జరిగింది. దానికి నేను కూడా వెళ్లాను. ఆ సమావేశంలో ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ వచ్చి ప్రధానోపన్యాసం చేశారు. ఆ సందర్భంగా, ఆయన సీతారాం ఏచూరిని ఉద్దేశించి "వీశేర్ జశీశ్రీశీబతీటబశ్రీ జశీఎఎబఅఱర్ ాముఎవతీ కామ్రేడ్ సీతారాం" అని సంబోధించారు, "ూఅఎ ూశ్రీంశీ్రాశీఎవతీటబశ్రీ ాముఎవతీ" అని కూడా అన్నారు. ప్రణబ్ ముఖర్జీ భారత రాష్ట్రపతిగా ఉన్నప్పుడు ఆయన కొన్ని ముఖ్యమైన పుస్తకాలు రచించారు. జవహర్‌లాల్ నెహ్రూ మ్యూజియంలో ఈ పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమానికి సీతారాం ఏచూరిని, నన్ను ఇద్దరినీ ఆహ్వానించారు. అక్కడికి వెళ్లిన తర్వాత ఆశ్చర్యపోయాం. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ తదితరులు అందరూ వేదిక ముందు కూర్చున్నారు. సీతారాంని, నన్ను వేదిక మీదకి ఆహ్వానించి ఆ పుస్తక ప్రారంభోత్సవంలో "బుక్ రూల్స్" పుస్తకం విడుదల చేసిన విషయంలో ఆయనను మాట్లాడమని కోరారు. బహుశా కాంగ్రెస్ పార్టీ మీద, సోనియాగాంధీ మీద ఏమైనా క్రిటికల్ రిమార్క్స్ ఉంటాయని భావించి సోనియాగాంధీ, రాహుల్ గాంధీ వేదిక మీదకు రాలేదని భావించాం. అయితే, అప్పుడు రాసిన ఆ పుస్తకాల్లో అలాంటి నెగటివ్ విమర్శలు ఏమి లేవు. ఈ సందర్భంలో సీతారాం మంచి ఉపన్యాసం చేశారు. ఈ రకమైన ఘటనలు చరిత్రలో నిలిచిపోతాయి. అనేక కీలకమైన అంశాల మీద ప్రణబ్ ముఖర్జీ తన అభిప్రాయాలను వెల్లడించారు.

ఆఫ్రికాకు చైనా భారీ సాయం

బి. లలితానంద ప్రసాద్(రిటైర్డ్ ప్రొఫెసర్)

ప్రపంచీకరణతో ప్రపంచం ఒక కుగ్రామం అయిందంటారు. కొన్ని సందర్భాలలో ఇది నిజమే అనిపిస్తుంది. గ్రామాల్లో సహజంగానే సంపన్న, మధ్య, అల్పాదాయ అట్టడుగు వర్గాలు ఉంటాయి. అదే రీతిలో వారి దైనందిన జీవితంలో ఒడిదుడుకులు, దీనావస్థలు ఉంటాయి. విశ్వ వ్యాప్తంగా మనిషి మారకపు వస్తువుగా కానటువంటి, కాసులు రాజ్యం ఏలని రోజులు ఉండేవి. అప్పుడు పరస్పరం మనః పూర్వకంగా అన్ని తరగతుల వారు సహకరించుకునేవారు. ఒకరికొకరు చేదోడువాదోడుగా ఉండేవారు. రాను రాను అవి అంతరిస్తున్నట్లు కనిపిస్తుంది. అయితే అందుకు భిన్నంగా ఇటీవల జరిగిన ఓ సమావేశం మరో మంచి గతాన్ని అంతర్జాతీయ స్థాయిలో గుర్తుకు తెస్తుంది. దీనికి అగ్ర రాజ్యాలలో ఒకటైన చైనా నాంది పలకడం ముదావహం.

ఈనెల మొదటి వారంలో చైనాలోని బీజింగ్‌లో ఆదేశం, ఆఫ్రికా ఖండం దేశాల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఇందులో చైనాతో పాటు ఆఫ్రికా ఖండంలోని వివిధదేశాల నేతలు, దౌత్యవేత్తలు, అధికారులు పాల్గొన్నారు. ఆఫ్రికాలోని 54 దేశాల్లో 53 దేశాలు ఈ సమావేశానికి హాజరయ్యాయి. ఇందులో ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ముఖ్యఅతిథిగా

పాల్గొన్నారు. ఇతర సంపన్న దేశాలకు ఆదర్శంగా నిలిచింది. దీన్ని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ 'భవిష్యత్తు భాగస్వామ్యంగా' అభివర్ణించడం గమనార్హం. 'ఆధునికత అనేది ప్రపంచంలో అన్ని దేశాల హక్కు' అంటూ 'పశ్చిమ దేశాల ధోరణి వర్ధమాన, బలహీన దేశాలను తీవ్ర బాధలకు గురి చేసింది' అని అన్నారు. ఇవి జరిగిన మూడు రోజులలో దాదాపు రెండు డజన్ల దేశాల నేతలు ద్వైపాక్షిక సమావేశాలు కూడా జరిపారు. పేదరికంలో ఉన్న చాడ్ నుండి ఆ ఖండం ఆర్థిక శక్తిగా పేరొందిన నైజీరియా వరకు దాదాపు 280 కోట్ల ప్రపంచ ప్రజలకు ప్రాతినిధ్యం వహించే దేశాలు పాల్గొన్నాయి. సమావేశం తీసుకున్న నిర్ణయాలు అమలు అక్కడ పౌర సమాజంపై తప్పక ప్రభావం చూపుతాయి. ఆఫ్రికా ఖండంలో ఎంతగా సహజ వనరులు ఉన్నప్పటికీ అక్కడి ప్రజలు దయనీయ స్థితిలో ఉన్నారు. చీకటి ఖండంగా పరిగణించే అక్కడి దేశాలకు చైనా స్నేహ హస్తం ఇవ్వడం ఓ వెలుగు రేఖలా కనిపించడం సహజం. అందువల్లనే అంత సమిష్టిగా ఎన్నో ఆశలతో ఈ సమావేశాలకు హాజరయ్యారు. వారి ఆశలు అడియాసలు చేయకుండా చైనా కూడా ఉదారంగా మూడు సంవత్సరాల క్రితం కన్నా ఇప్పుడు మూడు రెట్లు ఎక్కువగా 51 బిలియన్ డాలర్ల సహాయం ప్రకటించింది. ఈ ఉమ్మడి సమావేశాలు ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి జరుగుతాయి. ఇవి ఎనిమిదో సమావేశాలు. ఈ సహాయంద్వారా ఆయా దేశాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, వ్యవసాయ వృద్ధికి, భద్రత రక్షణకు ఉపయోగిస్తారు. బడుగు దేశాలకు ఇవన్నీ ఉన్న ఒడిదుడుకులను అధిగమించడానికి ఉపకరిస్తాయి. వీటితో పాటు కావాల్సిన సాంకేతిక సహకారం అనుసంధానం ఎలాగూ ఉంటుంది.

చైనాలో ఆర్థిక మాంద్యం,నిర్మాణరంగం సంక్షోభంలో ఉంది. తయారీ రంగం సామర్థ్య వినియోగం తక్కువగా ఉంది. అందుకు అమెరికా ఆంక్షలు, ఐరోపా షరతులతో వాణిజ్యం కుదింపు లాంటివి అనేకం వారి ఎగుమతులను తగ్గించాయి. ఎంతకు ముగియని ఉక్రెయిన్, గాజా యుద్ధాల కారణంగా అంతటా నెలకొన్న కోల్పోయిన మార్కెట్లు, సరఫరా గొలుసుల ఇక్కట్ల ప్రతిబంధకాలు ఉన్నాయి. ఆఫ్రికా ఖండం ఎగుమతులు 16 శాతం కాగా దిగుమతులు 25 శాతం. ఈ పరస్పర విదేశీ వాణిజ్యం ఆఫ్రికాకు ఉపయోగకారి. సమావేశంలో జరిగిన ఒప్పందాల ద్వారా ఆఫ్రికాలో తన కార్యకలాపాలను, సమర్థించుకునేందుకు చక్కటి అవకాశం చైనాకు లభించింది. ఆఫ్రికాకి ఈ ఒప్పందం ద్వారా అందించే ఆర్థిక సహకారం విమర్శలకు అతీతం ఏమీ కాదు. అవి ఇతర అంతర్జాతీయ ఆర్థిక సంస్థల విధించే పర్యావరణ, ద్రవ్య, పౌరహక్కుల లాంటి వాటికి సంబంధించిన షరతులు ఒత్తిడిలు ఉండవు. అక్కడ రోడ్లు, డ్యాములు, ఇండస్ట్రియల్ పార్కులు, ఫార్మా కంపెనీలు వస్తాయని ఆశిస్తున్నారు. అయితే చైనా గతంలో లాగా కాకుండా ఇప్పుడు పెద్దపెద్ద రైల్వే ప్రాజెక్టులు, ఎక్కువ సదుపాయాల కన్నా తక్కువ ఖర్చుతో అయ్యే వాటికి ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలియవస్తుంది. యువతకు డిజిటల్ స్కిల్ శిక్షణ లాంటివి. చైనా అధ్యక్షుడు ప్రకారం 60 వేల మందికి ఇందులో శిక్షణ ఇవ్వాలని సంకల్పించారు. మొత్తం మీద మిలియన్ మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. అది ఆఫ్రికా మీడియా, సైనిక విభాగాల అనుసంధానంతో. అణు సాంకేతికతను శాంతియుత పౌర వినియోగానికి ఉపయోగిస్తాం అంటున్నారు. అలాగే చైనా మీడియా ప్రకారం చైనా రుణదాతలు ఆఫ్రికా లోని గ్రామీణ ప్రాంతాల్లో సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు, సోయాబీన్ ప్లాంటింగ్ సాంకేతికతకు పూర్తి తోడ్పాటు నిస్తాయి. తద్వారా అక్కడ ప్రజానీకానికి ప్రత్యక్ష ప్రయోజనాలు ఉంటాయని పేర్కొంది.

పెట్టుబడులతో పాటు సౌహార్ద్ర దౌత్య సంబంధాలతో అంతర్జాతీయంగా ఐక్యరాజ్యసమితి లాంటి సంస్థలతో ఆఫ్రికా దేశాల పూర్తి మద్దతు చైనా పొందగలుగుతుంది. పిండుకున్న అంత పిండుకుని, పీల్చ గలిగినంత పీల్చి వేసి పిప్పి చేసి కట్టెలుగా వదిలేసిన, మిగిల్చిన ఆఫ్రికాలోని శూన్యాన్ని నింపే ప్రయత్నం చేస్తుంది చైనా. తన ప్రతిష్టను దక్షిణ ప్రపంచమంతా వివిధ రూపాల విస్తరిస్తుంది. ఈ ప్రక్రియలో అంతర్లీనంగా తాను బడుగు దేశాల రక్షకుడుగా ప్రకటించడంతో పాటు పశ్చిమదేశాలు అందునా సంపన్న దేశాలు పేద దేశాల గోడు విని తీరాలని, తగు మానవత్వంతో స్పందించి తీరాలని పరోక్షంగా హెచ్చరించినట్లు అయింది. మరోవేపు మధ్యప్రాచ్యంలో పాలస్తీనాలోని వివిధ గ్రూపులను ఒకటిగా చేసే దిశలోను పయనిస్తుంది. అలాగే ఇజ్రాయిల్ దాడుల తక్షణ విరమణకు ఒత్తిడి చేయడంలో అనేక దేశాలతో పాటు ఆఫ్రికా ఖండంలోని అన్ని దేశాలు మద్దతు పూర్తిగా కూడగట్ట కలుగుతుంది. ఇటీవల రష్యా కూడా ఉక్రెయిన్తో యుద్ధ విరమణ, శాంతి నెలకొల్పు ప్రయత్నాలలో మధ్యవర్తిగా బ్రెజిల్, ఇండియాతో పాటు చైనాను కూడా ఆహ్వానించటం అంతర్జాతీయ పరిణామాలలో వారి స్థానాన్ని తెలుపకనే తెలుపుతుంది. తద్వారా ప్రపంచంలోని శాంతి కాముకుల ఏకైక స్వరాన్ని ఇస్తుంది. ప్రపంచ మానవాళి శ్రేయస్సు దృష్ట్యా వారి ప్రయత్నాలు ఫలించాలని, ఈ సమావేశంలోని ఒప్పందాల ద్వారా ఆయా దేశాల్లోని ఏ కొందరివో కాక అక్కడ సామాన్య ప్రజలందరి మంచి భవిష్యత్తుకు అన్ని విధాల నాంది పలుకుతుందని ఆశిద్దాం.

సెల్: 9247499715

మహారాష్ట్ర బీజేపీకి షాక్...

కాంగ్రెస్ గూటికి సీనియర్ నేత

ముంబై: మహారాష్ట్రలో బీజేపీకి ఊహించని షాక్ తగిలింది. విదర్భ సీనియర్ నేత గోపాల్‌దాస్ అగర్వాల్ కాంగ్రెస్ గూటికి తిరిగి వచ్చారు. ఇటీవల బీజేపీకి రాజీనామా చేసిన ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. గతంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడైన గోపాల్‌దాస్ వరుసగా మూడుసార్లు 2004, 2009, 2014లో గోండియా ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే 2019 అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీజేపీలో చేరారు. ఆ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి వినోద్ ఎస్ అగర్వాల్ చేతిలో ఓడిపోయారు. త్వరలో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నందున బీజేపీకి ఆయన షాక్ ఇచ్చారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు అగర్వాల్ తన రాజీనామా లేఖ పంపారు. అనంతరం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రమేశ్ చెన్నితాల, మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోల్, అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు విజయ్ వాడెట్టివార్, మాజీ సీఎం పృథ్వీరాజ్ చవాన్, మాజీమంత్రులు నితిన్ రౌత్, సునీల్ కేదార్ సమక్షంలో తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. మరోవైపు కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న గిరిజన ప్రాంతంలోని గోండియా స్థానం నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో గోపాల్‌దాస్ పోటీ చేయవచ్చని తెలుస్తున్నది. 2019 మినహా 1952 నుంచి 12 సార్లు నిరంతరాయంగా ఈ స్థానాన్ని కాంగ్రెస్ దక్కించుకున్నది.

టపాసులతో కేజ్రీవాల్‌కు స్వాగతం... కేసు నమోదు

న్యూదిల్లీ: మద్యం విధానానికి సంబంధించిన కేసులో సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నిన్న రాత్రి తీహార్ జైలు నుంచి విడుదలయ్యారు. ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తలు పెద్దఎత్తున సంబరాలు చేసుకున్నారు. సీఎంకు టపాసులతో స్వాగతం పలికారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. బాణసంచా వినియోగంపై దిల్లీలో నిషేధం ఉండటంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. తీహార్ జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత దిల్లీ సివిల్ లైన్స్‌లో సీఎం నివాసం వెలుపల ఆప్ కార్యకర్తలు టపాసులు పేల్చారు. దీంతో పాటు దిల్లీలోని అనేక ప్రాంతాల్లోనూ కార్యకర్తలు బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. దీంతో భారతీయ న్యాయ సంహిత చట్టం కింద గుర్తుతెలియని వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు శనివారం వెల్లడించారు.

దేశ రాజధాని నగరంలో కాలుష్య నియంత్రణే లక్ష్యంగా బాణసంచా తయారీ, విక్రయాలపై నిషేధం విధిస్తున్నట్లు గత సోమవారం దిల్లీ ప్రభుత్వం ప్రకటించింది. ఈ నిషేధం వచ్చే ఏడాది జనవరి 1 వరకు అమలులో ఉండనుంది. ఆన్‌లైన్‌లో విక్రయాలు, డెలివరీలకూ ఈ నిషేధం వర్తిస్తుందని దిల్లీ పర్యావరణ శాఖ మంత్రి గోపాల్ రాయ్ వెల్లడించారు.

హనుమాన్ మందిర్‌కు కేజ్రీవాల్ దంపతులు

న్యూదిల్లీ: దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ దంపతులు కన్నాట్‌ప్లేస్‌లోని హనుమాన్ మందిర్‌లో ప్రత్యేక పూజలు చేశారు. దిల్లీ మద్యం పాలసీ కేసులో సుప్రీంకోర్టు బెయిల్ ఇవ్వడంతో కేజ్రీవాల్ శుక్రవారం తీహార్ జైలు నుంచి విడుదలయ్యారు. శనివారం ఉదయం తన భార్య సునీత కేజ్రీవాల్‌తో కలిసి హనుమాన్ మందిర్‌కు వెళ్లారు. కేజ్రీవాల్ దంపతుల వెంట దిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, ఎంపీ సంజయ్ సింగ్‌తోపాటు ఆప్ ముఖ్య నేతలు ఉన్నారు. వారంతా కలిసి హనుమంతుడికి ప్రత్యేక పూజలు చేశారు. దిల్లీ లిక్కర్ పాలసీ కేసులో ముందుగా కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్ట్ చేసింది. ఈడీ దర్యాప్తు పూర్తయ్యే సమయంలో అదే కేసులో సీబీఐ అరెస్ట్ చేసింది. దాంతో ఆయన మరికొన్ని నెలలు జైల్లో ఉండాల్సి వచ్చింది. ఎట్టకేలకు ఆరు నెలల తర్వాత ఆయన జైలు నుంచి విడుదలయ్యారు.

వర్షాలతో భారతావని అతలాకుతలం

- **18 రాష్ట్రాలకు భారీ వర్షాలు**
- **వాతావరణశాఖ హెచ్చరిక**

న్యూదిల్లీ: నైరుతి రుతుపవనాల ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో వర్షాలతో పాటు వరదలు పోటెత్తుతున్నాయి. జలాశయాలు నిండుకుండలుగా మారాయి. అదేసమయంలో ఆస్తి, ప్రాణనష్టం జరుగుతోంది. శనివారం భారీ వర్షాలు కురిశాయి. ఆదివారం కూడా వర్షాలు కొనసాగే అవకాశం ఉందని భారత వాతావరణశాఖ హెచ్చరించింది. ఈశాన్య బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా పశ్చిమ బెంగాల్, ఒడిశా, జార్ఖండ్, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లోని గంగా తీరాలలో ఆదివారం వరకు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. ఇది కాకుండా ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, సిక్కిం, మహారాష్ట్ర, గుజరాత్, ఈశాన్య రాష్ట్రాలలో రాబోయే మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ హెచ్చరికలు జారీ చేసింది. మరోవైపు మిజోరాం, త్రిపుర, అసోం, మేఘాలయ, బీహార్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార్ఖండ్ ప్రాంతాల్లోనూ వర్షాలు కురిస్తాయని తెలిపింది. జమ్మూ కశ్మీర్‌లోని కత్రాలోని త్రికూట పర్వతంపై రోజంతా పొగమంచు కారణంగా వైష్ణో దేవి వద్దకు హెలికాప్టర్లు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో భక్తులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అయినప్పటికీ, బ్యాటరీ కార్, రోప్‌వే సేవలు కొనసాగించారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయానికి సుమారు 18 వేల మంది భక్తులు అమ్మవారిని కొలుస్తూ భవనం వైపు బయలుదేరారు.

జ్యోతిర్మఠం-మలారి రహదారిని మూసివేయడంతో 47 మంది వ్యక్తులు మార్గమధ్యంలో చిక్కుకుపోయారు. పార్ధదీప్‌లో కొండచరియలు విరిగిపడటంతో బద్రీనాథ్ జాతీయరహదారిని మూసివేశారు. సిమ్లా, సిర్మౌర్ జిల్లాల్లో వరదలు వచ్చే అవకాశం ఉందని సిమ్లా వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. ఇప్పటికే పశ్చిమ హిమాలయ రాష్ట్రాలైన హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాల కారణంగా అనేక చోట్ల కొండచరియలు విరిగిపడటంతో జాతీయ రహదారులు సహా 400కి పైగా రహదారులపై రవాణా నిలిచిపోయింది. బద్రీనాథ్ జాతీయ రహదారిని మూసివేశారు. హిమాచల్‌లోని రెండు జిల్లాల్లో ఆకస్మిక వరదల ప్రమాదం పెరిగింది. అదే సమయంలో మైదాన రాష్ట్రాల్లో నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రోడ్లు జలమయమై జనజీవనం తీవ్రంగా ప్రభావితమైంది. ఉత్తరాఖండ్‌లోని కుమావోన్ ప్రాంతంలో వర్షాల కారణంగా ముగ్గురు మహిళలు సహా ఐదుగురు మరణించారు. ఈ మరణాలు లోహాఘాట్, పితోరాఘర్, అల్మోరా, హల్ద్వానీ, సితార్‌గంజ్‌లలో సంభవించాయి.

సీపీఎం నేత కల్తన్ దాస్‌గుప్తా... మరో ఇద్దరి అరెస్ట్

నిరసన చేస్తున్న వైద్యులపై దాడికి కుట్ర అని ఆరోపణ

కోల్‌కతా: నిరసన తెలుపుతున్న వైద్యులపై దాడికి కుట్ర పన్నారని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ (టీఎంసీ) ఆరోపించిన నేపథ్యంలో సీపీఎం నాయకుడు కల్తన్ దాస్‌గుప్తాతో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేసినట్లు పోలీసులు శనివారం తెలిపారు. రాష్ట్రంలోని మమతా బెనర్జీ ప్రభుత్వం ప్రతిష్ఠను దెబ్బతీయడానికి సాల్ట్ లేక్‌లోని స్వస్థ్ భవన్ వెలుపల నిరసన తెలుపుతున్న జూనియర్ వైద్యులపై దాడికి కుట్ర జరుగుతోందని ఆరోపిస్తూ టీఎంసీ నాయకుడు కునాల్ ఘోష్ చేసిన ఫోన్ కాల్ ఆడియో క్లిప్‌ను విడుదల చేయడంతో ఈ అరెస్టులు జరిగాయి. శుక్రవారం విడుదలయిన ఆడియో క్లిప్‌పై బిధాన్‌నగర్ పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేశారు. ఈ కేసులో అరెస్టయిన మరో వ్యక్తిని సంజీవ్ దాస్‌గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. దాస్‌ను శుక్రవారం రాత్రి దక్షిణ కలకత్తాలోని హల్తు నుంచి అరెస్టు చేయగా, దాస్‌గుప్తాను శనివారం ఉదయం అరెస్టు చేసినట్లు వారు వివరించారు. విలేకరుల సమావేశంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ అనీష్ సర్కార్ మాట్లాడుతూ 'జూనియర్ వైద్యులు రాష్ట్ర సచివాలయం నబన్నను సందర్శించిన రోజున బహుశా కుట్ర పన్నారు. సాంకేతిక విశ్లేషణ తర్వాత ఆడియో క్లిప్ ధ్రువీకరించబడింది. అందులో గొంతు తనదేనని దాస్ ఇప్పటికే అంగీకరించాడు' అని ఆయన తెలిపారు. క్లిప్‌లో పేర్కొన్న 'బప్పా', 'సాహెబ్', 'దాదు'లను గుర్తించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని సర్కార్ చెప్పారు. 'అరెస్టయిన ఇద్దరినీ ఈరోజు కోర్టు ముందు హాజరు పరుస్తామని, పోలీసులు వారిని 14 రోజుల కస్టడీని కోరుతారని' అన్నారు. ఇదిలాఉండగా, ఆర్‌జి కర్ వైద్య కళాశాల ఆస్పత్రిలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనపై నిరసనల నుంచి దృష్టిని మరల్చడానికి అరెస్టులు చేశారని సీపీఎం సీనియర్ నాయకుడు సుజన్ చక్రవర్తి ఆరోపించారు. ఈ కుట్ర ఎంత లోతుగా ఉందో పరిశీలించాలని కోరుతూ సీబీఐ విచారణ జరిపించాలని కోరారు.

అంపశయ్యపై ఉగ్రవాదం

జమ్మూకశ్మీరు ఎన్నికల ప్రచారంలో మోదీ

దోడా: ఓ పక్క రోజూ ఏదో ఓ మూల ఎన్‌కౌంటర్లు కొనసాగుతున్న వేళ... జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదం కొన ఊపిరితో ఉందని, శాంతి-సుస్థిరతకు తాను భరోసాగా ఉంటానని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పుకొచ్చారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి ప్రధాని శనివారం శ్రీకారం చుట్టారు. దోడా జిల్లాలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య నిర్వహించిన భారీ ర్యాలీలో ప్రధాని ప్రసంగించారు. ఏళ్ల తరబడి జమ్మూ కశ్మీర్‌లో పాలన సాగించిన కాంగ్రెస్, పీడీపీ, నేషనల్ కాన్ఫరెన్స్‌పై ఎదురుదాడి చేశారు. సంపన్న జమ్మూకశ్మీర్‌కు తాను గ్యారెంటీ ఇస్తున్నానని చెప్పారు. 'మీకోసం, దేశం కోసం ఎన్నిసార్లు కష్టపడటానికైనా నేను సిద్ధంగా ఉన్నాను. మనమంతా కలిసికట్టుగా సురక్షిత, అభ్యుదయ జమ్మూకశ్మీర్‌ను నిర్మించుకుందాం. అందుకు నేను హామీ ఇస్తున్నాను. ఏ పార్టీలపై మీరు విశ్వాసం చూపించారో... వారు మిమ్మల్ని పట్టించుకోలేదు. జమ్మూకశ్మీర్ యువత ఉగ్రవాదం కోరల్లో నలిగిపోయింది. మీరు నమ్ముకున్న పార్టీలు మిమ్మల్ని మోసం చేశాయి. జమ్మూకశ్మీర్‌లో కొత్త నాయకత్వాన్ని రాకుండా చేశారు' అని మోదీ అన్నారు. కాంగ్రెస్, పీడీపీ, ఎన్సీ పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు అవినీతి రాజ్యమేలిందని, జమ్మూకశ్మీర్‌లో ఏళ్ల తరబడి వేర్పాటువాదం, ఉగ్రవాదం వేళ్లూనుకునేలా చేశారని ప్రధాని ఆరోపించారు. ఈ ఎన్నికలు జమ్మూకశ్మీర్‌లోని యువకులకు, మూడు కుటుంబాలకు మధ్య జరుగుతున్నాయని చెప్పారు. ఒక కుటుంబం కాంగ్రెస్, తక్కిన రెండూ ఎన్‌సీ, పీడీపీ అని చెప్పారు. ఆ మూడు కుటుంబాలు వేర్పాటువాదం, ఉగ్రవాదానికి అవసరమైన వేదికను ఇక్కడ ఏర్పాటు చేశాయని, ఇందువల్ల దేశానికి శత్రువులైన వారే లబ్ధి పొందారని అన్నారు. ఇటీవల కొద్ది సంవత్సరాల్లో జమ్మూకశ్మీర్‌లో తీసుకువచ్చిన మార్పులను ప్రస్తావిస్తూ... ఉగ్రవాదం జమ్మూకశ్మీర్‌లో అంపశయ్యపై ఉండి తుదిశ్వాసతో కొట్టుమిట్టాడుతోందని అన్నారు. పోలీసులు, సైన్యం ఒకప్పుడు విసిరిన రాళ్లు ఇప్పుడు జమ్మూకశ్మీర్ నిర్మాణానికి వినియోగిస్తున్నామని చెప్పారు. దశాబ్దాలుగా రిజర్వేషన్‌కు నోచుకోని పహాడీ, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు బీజేపీ ప్రభుత్వం రిజర్వేషన్లు కల్పించిందన్నారు. ఈరోజు చాలామంది తొలిసారి ఓటు హక్కుకు నోచుకున్నారని చెప్పారు. భారత రాజ్యాంగం ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించిందని, కొందరు తమ జేబుల్లో రాజ్యాంగాన్ని పెట్టుకుని, 75 ఏళ్లుగా మీలో కొందరిని ఎలాంటి హక్కులకు నోచుకోకుండా చేశారని విమర్శించారు.

జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఎప్పుడు?

ప్రధానిని నిలదీసిన జైరాం రమేశ్

న్యూదిల్లీ : కేంద్ర పాలిత ప్రాంతానికి పూర్తి రాష్ట్ర హోదా ఎప్పుడు వస్తుందని కాంగ్రెస్ శనివారం ప్రశ్నించింది. ఈ ప్రాంతం 'బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ రాజకీయ ముఠాతో నియంత్రించబడే అధికార దౌర్జన్యంగా మారిందని' విమర్శించింది. 2018లో పీడీపీ-బీజేపీ ప్రభుత్వం పడిపోయినప్పటి నుంచి జమ్మూకశ్మీర్‌లో మోదీ ప్రభుత్వ పాలన కొనసాగుతోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్) జైరాం రమేశ్ పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌కు పూర్తి రాష్ట్ర హోదా ఎప్పుడు వస్తుందని ప్రధానిని ఆయన ప్రశ్నించారు. 2018 నుంచి జమ్మూకశ్మీర్ ప్రజలు తమ మనోవేదనలను వ్యక్తం చేయడానికి ఎటువంటి మార్గాన్ని నిరాకరించారని ఆయన ఆరోపించారు. 'ఈ ప్రాంతం బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ రాజకీయ ముఠాతో నియంత్రించబడే అధికార దౌర్జన్యంగా మారింది. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా ముగించామని చెప్పుకుంటూనే ప్రభుత్వం వాస్తవానికి కొత్త, ప్రత్యేకమైన రాజకీయ వ్యవస్థకు సంబంధించి ప్రత్యేక పరిస్థితిని సృష్టించింది. రాష్ట్రాన్ని కేంద్ర పాలిత ప్రాంతం (యూటీ) కి తగ్గించడం, ఎన్నికలు నిలిపివేయడం, రాజ్యాంగ నైతికతకు సంబంధించి అన్ని నిబంధనలను ఉల్లంఘించడం' అని ఆయన ఆరోపించారు. డిసెంబరు 11, 2023న పార్లమెంటులో చేసిన ప్రసంగంలో హోం మంత్రి అమిత్ షా జమ్మూకశ్మీర్‌కు పూర్తి రాష్ట్ర హోదాను 'సముచితమైన సమయంలో పునరుద్ధరిస్తారని పేర్కొన్న విషయాన్ని జైరాం రమేశ్ ఎత్తి చూపారు. 'రాష్ట్ర హోదాను తొలగించి ఐదేళ్లు గడిచినా, రాష్ట్ర హోదాను తిరిగి పొందే కాలక్రమం ఏమిటో జమ్మూకశ్మీర్ ప్రజలకు ఇప్పటికీ స్పష్టత లేదు. గత ఐదేళ్ల అనుభవం ఆధారంగా అసెంబ్లీ ఎన్నికలను ఏదో ఒక సాకుతో ఆలస్యం చేశారు' అని 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. శుక్రవారం కిష్త్వార్‌లో ఉగ్రవాదుల దాడుల్లో ఇద్దరు భారత ఆర్మీ సిబ్బందిని కోల్పోయారని, దీనికి నైతిక బాధ్యత ఎవరు తీసుకుంటారని ప్రశ్నించారు. 'ఆర్టికల్ 370ని ప్రభుత్వం రద్దు చేయడం వల్ల ఉగ్రవాదాన్ని అరికట్టగలిగామని జీవయేతర ప్రధాన మంత్రి అనేక సార్లు మాట్లాడే అంశాలలో ఒకటి. గత కొన్ని నెలల్లో ఇది చాలావరకు శాంతియుతంగా ఉందని మేము భావించిన పొరుగు జిల్లాలకు కూడా వ్యాపించింది. జూన్ 9న రియాసిలో జరిగిన దాడి, జూన్ 10న కతువాలో జరిగిన దాడి, జూన్ 11న దోడాలో జరిగిన దాడి, ఆగస్టు 19న ఉధంపూర్‌లో, సెప్టెంబరు 13న కిష్త్వార్‌లో అంతర్జాతీయ సరిహద్దు వెంబడి చొరబాటు పెరుగుతోంది. జమ్మూకశ్మీర్ అంతటా స్పష్టమైన అభద్రతా భావం నెలకొని ఉంది' అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. జమ్మూకశ్మీర్‌లో శాంతిభద్రతల పరిస్థితి గురించి కేంద్ర ప్రభుత్వం దేశానికి ఎందుకు నిరంతరం అబద్ధాలు చెబుతోంది? అని జైరాం రమేశ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ పాలనలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా ఎందుకు బాగా పెరిగిందని ఆయన ప్రశ్నించారు. ఐదేళ్లలో మాదకద్రవ్యాల వినియోగం 30 శాతం పెరిగిందని, స్మగ్లింగ్ రింగ్‌లు చాలా అధునాతనంగా మారాయని, ప్రభుత్వ అధికారుల ప్రమేయం కూడా ఉందని ఆయన ఆరోపించారు. కశ్మీరీ పండితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని జైరాం రమేశ్ విమర్శించారు.

హోటల్ ఓనర్‌తో క్షమాపణలు చెప్పించడం సిగ్గు చేటు: స్టాలిన్

చెన్నై: తమిళనాడుకు చెందిన 'శ్రీ అన్నపూర్ణ రెస్టారెంట్' యజమాని శ్రీనివాసన్‌తో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు క్షమాపణలు చెప్పించడం సిగ్గు చేటని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. ఓ సమావేశంలో జీఎస్టీపై మాట్లాడినందుకే అతడితో బలవంతంగా నిర్మలా సీతారామన్‌కు క్షమాపణలు చెప్పించారని మండిపడ్డారు. 'ఇది ఎంతో నిరుత్సాహకరమైన చర్య. కేంద్ర మంత్రి స్థాయిలోని వారు అలా చేయడం సిగ్గు చేటు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న చర్యలను ప్రజలు చూస్తూనే ఉన్నారు' అని స్టాలిన్ పేర్కొన్నారు. ఇటీవల రెస్టారంట్ల యజమానులతో కేంద్ర ప్రభుత్వం ఓ సమావేశం నిర్వహించింది. అందులో పాల్గొన్న శ్రీనివాసన్ ... పెరుగుతున్న జీఎస్టీ గురించి నిర్మలా సీతారామన్‌ను ప్రశ్నించారు. రెస్టారెంట్ల యజమానులు ఎదుర్కొంటున్న సవాళ్లను తెలియజేశారు. అనంతరం ఓ ప్రైవేటు కార్యక్రమంలో ఆయన ఆర్థికమంత్రిని కలిసి 'నేను చేసిన వ్యాఖ్యలకు నన్ను క్షమించండి. నేను ఏ రాజకీయ పార్టీకి చెందినవాడిని కాదు' అంటూ ఆమెకు క్షమాపణలు చెప్పిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బీజేపీ తమిళనాడు అధికారిక హ్యాండిల్ ఈ వీడియోను పోస్ట్ చేసింది. దీనిపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు చేసింది. ఆ వ్యక్తిపై కేంద్ర ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడిందని, ఇందుకుగాను సీతారామన్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఈ విషయంపై మాట్లాడుతూ... 'తన బిలియనీర్ స్నేహితులు నిబంధనలను వక్రీకరించడానికి, చట్టాలను మార్చడానికి, జాతీయ ఆస్తులను సొంతం చేసుకోవడానికి ప్రయత్నించినప్పుడు ప్రధాని వారికి రెడ్ కార్పెట్ పరుస్తారు. చిన్న వ్యాపారులు మాత్రం నోట్ల రద్దు, పన్ను దోపిడీలు, జీఎస్టీలను ఎదుర్కొంటున్నారు. చివరికి అవమానాలు కూడా వారికే' అంటూ దుయ్యబట్టారు. ఈ వీడియోపై తీవ్ర వ్యతిరేకత వస్తుండటంతో బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు కే అన్నామలై బహిరంగ క్షమాపణలు చెప్పారు.

టైమ్స్ ఉత్తమ కంపెనీల జాబితాలో అదానీ గ్రూపు

న్యూదిల్లీ: టైమ్స్‌కు చెందిన ఈ ఏడాది ప్రపంచ అత్యుత్తమ కంపెనీల జాబితాల్లో అదానీ గ్రూపు చోటు సంపాదించింది. గ్లోబల్ ర్యాంకింగ్, స్టాటిస్టిక్స్ పోర్టల్ స్టాటిస్‌స్టా కూడా ఈ లిస్టును రూపొందించింది. ఉత్తమ కంపెనీల లిస్టులో చోటు దక్కడం పట్ల అదానీ గ్రూపు ఓ ప్రకటన చేసింది. ఉద్యోగుల సంతృప్తి, ఆదాయ వృద్ధి, స్థిరత్వం ఆధారంగా గుర్తింపు లభించడం సంతోషకరమని అదానీ గ్రూపు తన ప్రకటనలో తెలిపింది. మూడు అంశాల ఆధారంగా వరల్డ్స్ బెస్ట్ కంపెనీస్ 2024 జాబితాను తయారు చేశారు. అదానీ గ్రూపునకు చెందిన 8 కంపెనీలను విశ్లేషించిన తర్వాత ఆ లిస్టులో చోటు కల్పించారు. అదానీ ఎంటర్ ప్రైజెస్, అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్, అదానీ టోటల్ గ్యాస్, అంబుజ సిమెంట్స్, అదానీ పవర్, అదానీ విల్మర్ లిమిటెడ్ కంపెనీలు ఆ గ్రూపులో ఉన్నాయి. 50 దేశాల్లో ఉన్న లక్షా 70 వేల మంది ఉద్యోగుల నుంచి సర్వే చేపట్టారు.

ఆరోగ్య సంరక్షణ మాపైనే ఆధారపడి లేదు

బెంగాల్ జూనియర్ వైద్యుల స్పష్టీకరణ

కోల్‌కతా: తమ ఆందోళనల కారణంగా రాష్ట్రంలో ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ కుప్పకూలిందని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చెప్పడాన్ని స్వస్థ భవన్ ముందు జూనియర్ వైద్యులు ప్రశ్నించారు. బెంగాల్ ఆరోగ్య సంరక్షణ కేవలం 3 శాతం జూనియర్ వైద్యులపై మాత్రమే ఆధారపడదని స్పష్టం చేశారు. ఆగస్టు 9న ప్రభుత్వ అధీనంలోని ఆర్‌జీ కర్ వైద్య కళాశాల ఆస్పత్రిలో 31 ఏళ్ల పోస్ట్‌గ్రాడ్యుయేట్ జూనియర్ వైద్యురాలు హత్యాచారానికి గురైనప్పటి నుంచి జూనియర్ వైద్యులు నిరవధిక నిరసన కొనసాగిస్తున్నారు. 'మేము కేవలం చికిత్స ప్రమాణాలను నేర్చుకోవడానికి ఉద్దేశించిన జూనియర్ వైద్యులమే. రాష్ట్ర ఆరోగ్య సంరక్షణ కేవలం ఈ 3 శాతం జూనియర్ వైద్యులపై మాత్రమే ఆధారపడదు' అని పశ్చిమ బెంగాల్ జూనియర్ డాక్టర్స్ ఫ్రంట్ ప్రతినిధి ఒకరు తమ ఫేస్‌బుక్ పేజీలో శుక్రవారం సాయంత్రం పోస్ట్ చేసిన వీడియోలో తెలిపారు. 'రాష్ట్ర ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ పూర్తిగా 3 శాతం జూనియర్ వైద్యులపై ఆధారపడి ఉంటే, ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో ప్రస్తుతం అనేక ఖాళీలు, అడుగడుగునా అనేక మౌలిక సదుపాయాలకు సంబంధించి ఇప్పటికే ఉన్న అనేక లోపాలకు ఈ ప్రశ్న స్వయంచాలకంగా మళ్లించబడుతుంది' అని ఆ ప్రతినిధి చెప్పారు. ప్రభుత్వం చర్చల పిలుపును జూనియర్ వైద్యులు తిరస్కరించిన తరువాత కూడా ఆందోళన కొనసాగుతున్నందున 27 మంది ప్రాణాలు కోల్పోయారని ముఖ్యమంత్రి చెప్పారు. 'ఏడు లక్షల మందికి చికిత్స అందడం లేదు. గుండెపోటుతో సహా గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న దాదాపు 1,500 మంది శస్త్ర చికిత్సల కోసం ఎదురుచూస్తున్నారు' అని మమత గురువారం చెప్పారు. 'చికిత్స అందక మరణించిన వారి కోసం నేను కొవ్వొత్తి వెలిగించాలా, వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేయాలా? చాలా మంది ఇళ్లలో ప్రాణాలు కోల్పోయారు. మేము ఆ గణాంకాలను పొందడానికి ప్రయత్నిస్తాం' అని అన్నారు. చికిత్స అందక ప్రాణాలు కోల్పోయిన ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున పరిహారం అందజేస్తామని సీఎం శుక్రవారం ప్రకటించారు. అయితే ముఖ్యమంత్రి వ్యాఖ్య తమను నిరుత్సాహానికి గురి చేసిందని జూనియర్ వైద్యులు అన్నారు. 'మా పని విరమణ కారణంగా ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ ఎలా కుప్పకూలిందో ముఖ్యమంత్రి ప్రస్తావించారు. కొన్ని ఉదాహరణలను ఉటంకిస్తూ ఇది మమ్మల్ని మరింత నిరుత్సాహపరిచింది' అని ప్రతినిధి చెప్పారు. 'మా అన్ని సౌకర్యాలు నిరంతరాయంగా ఉన్నాయని, మా సీనియర్ ఫ్యాకల్టీలందరూ ఆరోగ్య సంరక్షణ సేవలను కొనసాగించడానికి అవిశ్రాంతంగా పని చేస్తున్నారని మేము ఇప్పటికే పేర్కొన్నాం. ఎటువంటి అహంకారం లేదా అహం లేకుండా ఆరోగ్య సంరక్షణ సేవలపై ఒక ప్రశ్న మా గౌరవనీయులైన సీనియర్ ఫ్యాకల్టీలను నర్సులు, ఆస్పత్రి ఇతర సిబ్బందిని ప్రత్యక్షంగా అవమానించడమేనని మేము నమ్ముతున్నాం' అని తెలిపారు. ఆగస్టు 11వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా విధుల్లో చేరాలని నిరసన తెలిపిన జూనియర్ వైద్యులకు సుప్రీం కోర్టు తెలిపింది. తిరిగి విధుల్లో చేరిన జూనియర్ వైద్యుల జాబితాను పంపాలని బోధనాసుపత్రుల ప్రిన్సిపాళ్లను వైద్య విద్య డైరెక్టర్ కోరారు. కాగా, బెంగాల్‌లోని సీనియర్ వైద్యులు, ఆల్ ఇండియా రెసిడెంట్ డాక్టర్ల సమాఖ్య నిరసన చేస్తున్న జూనియర్ వైద్యులపై ఏదైనా శిక్షార్హమైన చర్య తీసుకుంటే వెంటనే సమ్మె చేస్తామని బెదిరించారు. వారు ఐదు న్యాయమైన డిమాండ్లను ముందుకు తెచ్చారని, అవన్నీ అభయకు న్యాయం చేయడానికి చాలా సందర్భోచితమైనవని తెలిపారు. అయితే వివిధ పరిపాలనాధికారులు, ఇతర పెద్దల వద్దకు వెళ్లి తమ డిమాండ్లను నెరవేర్చాలని అనేక సార్లు కోరినప్పటికీ తమకు న్యాయం జరగలేదని అన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఆహ్వానం తమలో ఆశలు నింపిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చర్చల ప్రత్యక్ష ప్రసారం వంటి 'చిన్న సమస్య' పై సమావేశాన్ని ఎందుకు రద్దు చేసిందని జూనియర్ వైద్యులు ప్రశ్నించారు.

పోక్సో కేసు పెట్టారని... 50 దళిత కుటుంబాల వెలి

బెంగళూరు: కర్నాటకలోని యాద్గిర్ జిల్లాలో ఓ బాలిక (15)పై అత్యాచారం చేసిన అగ్రవర్ణానికి చెందిన వ్యక్తిపై పోక్సో కేసు పెట్టడంతో గ్రామంలోని దళితులను వెలివేశారు. పోలీసుల వివరాల ప్రకారం... బాలిక ఆరోగ్య పరిస్థితి బాగా లేకపోవడంతో తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయించగా బాలిక గర్భవతి అని తేలింది. దీంతో వారు బాలికను ప్రశ్నించగా ఓ వ్యక్తి తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఘాతుకానికి పాల్పడ్డాడని, ఎవరికీ చెప్పొద్దని బెదిరించాడని పేర్కొంది. దీంతో వారు నిందితుడి వద్దకు వెళ్లి ఆమెను వివాహం చేసుకోవాలని కోరారు. అతడు అగ్రవర్ణానికి చెందిన వ్యక్తి కావడంతో దళిత బాలికను వివాహం చేసుకోవడానికి నిరాకరించాడు. బాధితురాలి కుటుంబం అతడిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఆ గ్రామంలో 50 దళిత కుటుంబాలను గ్రామ పెద్దలు వెలేశారు. ఈ విషయమై దళిత సంఘాల సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. గ్రామ పెద్దలను అదుపులోకి తీసుకొని విచారించగా వారు ఆ ఆరోపణలను ఖండించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తాజ్‌మహల్ ప్రధాన డోమ్ వద్ద లీకేజీ

ఆగ్రా: ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఆగ్రాలోని పాలరాతి కట్టడం తాజ్ మహల్ ప్రధాన డోమ్ వద్ద నీరు లీకవుతున్నట్లు అధికారులు వెల్లడించారు. మూడు రోజులుగా ఆగ్రాలో భారీగా వర్షాలు కురవడమే ఇందుకు కారణమని తెలిపారు. అయితే ఆ నీటి లీకేజీ వల్ల ఎలాంటి నష్టం లేదని తెలిపారు. కాగా, తాజ్‌మహల్ ఆవరణలోని తోటను వరద ముంచెత్తింది. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. 'గత మూడు రోజులుగా ఆగ్రాలో కురుస్తున్న వర్షాల వల్ల తాజ్‌మహల్ ప్రధాన డోమ్ వద్ద నీరు లీకవుతుంది. దీనివల్ల ఎటువంటి నష్టం లేదు' అని ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) పేర్కొంది. ఇదే విషయాన్ని ఆగ్రా సర్కిల్ సూపరింటెండింగ్ చీఫ్ రాజ్‌కుమార్ పటేల్ ధ్రువీకరించారు. డ్రోన్ కెమెరాల సహాయంతో డోమ్ పరిస్థితిని పరిశీలించామన్నారు. సీపేజ్ వ్యవస్థలో లోపం కారణంగా లీక్ సంభవిస్తున్నట్లు వెల్లడించారు. అయితే దీనివల్ల ఎలాంటి నష్టం లేదన్నారు.

జమ్మూకశ్మీర్‌లో వరుస ఎన్‌కౌంటర్లు... ఐదుగురి మృతి

జమ్మూ/శ్రీనగర్: కేంద్ర పాలిత ప్రాంతం జమ్మూకశ్మీర్‌లో నాలుగు రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు ప్రారంభం కానున్నక్రమంలో వరుసగా ఉగ్రదాడులు, ఎన్‌కౌంటర్‌లు చోటుచేసుకోవడం తీవ్ర కలకలం రేపుతోంది. 24 గంటల్లోనే మూడుచోట్ల జరిగిన ఎదురుకాల్పుల్లో ఐదుగురు ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. మరోవైపు ఉగ్ర వ్యతిరేక ఆపరేషన్‌లో ఇద్దరు జవాన్లు అమరులయ్యారు. మోదీ జమ్మూకశ్మీర్ పర్యటనకు ముందు ఈ పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం. బారాముల్లా జిల్లాలోని పట్టాన్ ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కినట్లు నిఘా వర్గాల నుంచి పక్కా సమాచారం వచ్చింది. దీంతో ఆర్మీ, జమ్మూకశ్మీర్ పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి తర్వాత సంయుక్త ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున భద్రతా సిబ్బందిపైకి ఉగ్రవాదులు కాల్పులకు దిగారు. దీంతో బలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. ఈ ఘటనలో ముగ్గురు ఉగ్రవాదులు హతమైనట్లు ఆర్మీ నార్తర్న్ కమాండ్ అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ఆపరేషన్ కొనసాగుతోంది. అంతకుముందు కథువా జిల్లాలో రైజింగ్ స్టార్ కార్ప్స్, జమ్మూకశ్మీర్ పోలీసులు ఉగ్ర వ్యతిరేక ఆపరేషన్ చేపట్టాయి. సుదీర్ఘంగా కొనసాగిన ఈ ఎన్‌కౌంటర్‌లో శుక్రవారం రాత్రి ఇద్దరు ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లు అధికారులు వెల్లడించారు. పెద్దఎత్తున ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. అంతకుముందు కిష్త్వాడ్ జిల్లాలో ఉగ్రవాదులతో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు సైనికులు అమరులయ్యారు. వారిలో ఒకరు జూనియర్ కమిషన్డ్ అధికారి. ఇదిలాఉండగా.. కిష్త్వాడ్, ఉధంపూర్, పూంఛ్, రాజౌరీ జిల్లాల్లో యాంటీ టెర్రర్ ఆపరేషన్లను మరింత పెంచినట్లు భద్రతా బలగాలు వెల్లడించాయి.

పీవీఆర్ చౌదరి కన్నుమూత

చౌదరి మరణం వామపక్ష ఉద్యమానికి తీరని లోటు

సంతాపసభలో వక్తల నివాళి

విశాలాంధ్ర-ఒంగోలు: సీపీఐ సీనియర్ నాయకుడు పీవీఆర్ చౌదరి శనివారం గుండెపోటుతో మృతిచెందారు. ఉదయం తన స్వగ్రామం పొందూరు నుంచి బసులో ఒంగోలు వెళుతూ మార్గమధ్యలోనే కన్నుమూశారు. పీవీఆర్ చౌదరి మృతి వామపక్ష ఉద్యమానికి తీరని లోటని నాయకులు పేర్కొన్నారు. సీపీఐ ఒంగోలు నగర కార్యదర్శి, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు పీవీఆర్ చౌదరి(56) శనివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. తన స్వగ్రామమైన పొందూరు నుండి ఒంగోలుకు బస్సు ఎక్కిన చౌదరి...మార్గమధ్యంలో గుండెపోటుతో మృతి చెందారు. సీపీఐ కార్యకర్తలు, వామపక్ష శ్రేణులు, కార్మికులు, అభిమానుల సందర్శనార్థం మధ్యాహ్నం మూడు గంటల వరకు ఆయన భౌతికకాయాన్ని ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో ఉంచారు. చౌదరి భౌతికకాయానికి సీపీఐ జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకత్వంతో పాటు సీపీఎం, సీపీఐ ఎంఎల్, సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ, రెడ్‌స్టార్, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్మిక సంఘాల నాయకులు, రైతు సంఘాల నాయకులు, కార్మికులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీగా తరలివచ్చి నివాళులు అర్పించారు. చౌదిరితో తమ సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకుంటూ కన్నీటి పరంతమయ్యారు. అనంతరం తన స్వగ్రామమైన పొందూరుకు చౌదరి భౌతికకాయాన్ని తరలించారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో చౌదరి సంతాప సభ జరిగింది. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అధ్యక్షత వహించారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య మాట్లాడుతూ పీవీఆర్ చౌదరి మరణం తనను కలచి వేసిందన్నారు. చౌదరి గొప్ప కమ్యూనిస్టు నాయకుడని చెప్పారు. చౌదరిని చూసి నేటి తరం నాయకులు ఎంతో నేర్చుకోవాల్సింది ఉందన్నారు. ఒంగోలుకు వస్తే మొదటగా తాను కలిసేది చౌదరినేనని తెలిపారు. తాను నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు నిలిచిన గొప్ప నాయకుడు అని పేర్కొన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో వరద బాధితుల సహాయార్థం సేకరించిన నిధిని, వస్తువులను శుక్రవారం విజయవాడలో బాధితులకు పంపిణీ చేయడంలో చౌదరి క్రియాశీలకంగా పని చేశారని గుర్తుచేశారు. చౌదరి మరణాన్ని జీర్ణించుకోలేక పోతున్నా మన్నారు. చౌదరి జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు. వామపక్ష, కార్మిక, రైతాంగ ఉద్యమాలలో చౌదరి అన్నీ తానై ముందుకు నడిపారన్నారు. చౌదరి మరణం ప్రకాశం జిల్లా వామపక్ష ఉద్యమానికి తీరని లోటన్నారు. ఏపీ ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) మాట్లాడుతూ చౌదరి మరణం తన ఇంట్లో సభ్యుణ్ణి కోల్పోయినట్లు ఉందన్నారు. తన కుమారుడు మృతి చెందినట్లు బాధగా ఉందన్నారు. చిన్నతనం నుండి తన ఇంట్లో పెరిగిన వ్యక్తి అన్నారు. తన వద్ద ఉద్యమాల ఓనమాలు నేర్చుకున్నాడని ఆవేదన చెందారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ కార్మిక ఉద్యమం పట్ల పూర్తి స్థాయి అవగాహన చౌదరికి ఉందన్నారు. చౌదరిలేని మల్లయ్య లింగం భవనాన్ని ఊహించుకోలేమన్నారు. ఏఐటీయుసి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా కార్మికోద్యమంలో చౌదరి పాత్ర కీలకన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం తుదికంటా పోరాడన్నారు. రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజాఉద్యమాలలో చౌదరితో కలిసి సుదీర్ఘ ప్రయాణం చేశానన్నారు. ఆయన ఆదర్శ కమ్యూనిస్టు అని పేర్కొన్నారు. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి డీవీఎన్ స్వామి, సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడారు. సీపీఐ జిల్లా నాయకులు ఉప్పుటూరి ప్రకాశరావు, ఏఐటీయూసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటసుబ్బయ్య, నాయకులు లలిత కుమారి, భీమవరపు సుబ్బారావు, టీ అరుణ, చుండూరి రంగారావు, చుంచు శేషయ్య, కరవది రాఘవరావు, శుభాన్ నాయుడు, కొత్తకోట వెంకటేశ్వర్లు, చీకటి శ్రీనివాసరావు, కాలం సుబ్బారావు, కంకణాల ఆంజనేయులు, షేక్ మాబు, పద్మ, విజయ, రాజశేఖర్, ఎస్‌డీ మౌలాలి, మోహన్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు. అనంతరం చౌదరి స్వగ్రామమైన టంగుటూరు మండలం పొందూరులో అంత్యక్రియలు నిర్వహించారు.

రామకృష్ణ సంతాపం

పీవీఆర్ చౌదరి ఆకస్మిక మృతి పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియచేశారు.

చౌదరి ఏఐఎస్ఎఫ్‌లో క్రియాశీలకంగా పనిచేసి... కమ్యూనిస్టు ఉద్యమంలో పూర్తికాలం కార్యకర్తగా, స్థానిక నాయకుడిగా దశాబ్దాలుగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. 13వ తేదీన విజయవాడలో వరదబాధితులకు ఒంగోలు ప్రజల నుండి సేకరించిన వస్తుసామగ్రిని పంపిణీ చేశాడని గుర్తుచేశారు. చౌదరి మృతికి సీపీఐ రాష్ట్ర సమితి తరఫున ప్రగాఢ సంతాపం ప్రకటించారు. చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.

మంచి స్నేహితుడిని కోల్పోయా: వందేమాతరం

చౌదరి మరణ వార్త తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ప్రముఖ సినీ సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఒంగోలులోని నల్లూరి అన్న ఇంటిలో తాను ఉన్న రోజులలో నిత్యం తాము కలిసేవాళ్లమని తెలిపారు. వామపక్ష ఉద్యమాల గురించి చర్చించే వాళ్లమన్నారు. మంచి స్నేహితుడిని కోల్పోయానని నివాళి అర్పించారు.

విశాలాంధ్ర సిబ్బందికి వరద సాయం

బియ్యం, వస్త్రాలు రామకృష్ణ అందజేత

విశాలాంధ్ర-విజయవాడ: బుడమేరు వరదల్లో నష్టపోయిన విశాలాంధ్ర సిబ్బందికి సీపీఐ రాష్ట్ర సమితి ఆపన్నహస్తం అందించింది. బియ్యం, నూతన వస్త్రాలు పంపిణీ చేసింది. విశాలాంధ్ర దినపత్రిక కార్యాలయం చంద్రం బిల్డింగ్స్‌లో ఈ కార్యక్రమం శనివారం జరిగింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, పి. హరినాథరెడ్డి, విశాలాంధ్ర డీజీఎం టి. మనోహర్ నాయుడు, ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు వెంకటేశ్వర రావు, కార్యదర్శి ఎం.మురళీకృష్ణ, సీపీఐ శాఖ కార్యదర్శి పి.మధుసూదన రావు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్, ఇస్కఫ్ నాయకుడు కాగితాల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆ నిర్ణయం వెనక్కి

ఆంధ్రప్రదేశ్ విద్యార్థుల తల్లిదండ్రుల సంఘం డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: కొత్త వైద్య కళాశాలలో పోస్ట్ గ్రాడ్యుయేట్ సీట్ల స్థానంలో పీపీపీలను ఆహ్వానిస్తూ జీవో 85 ద్వారా పీజీ వైద్య విద్యలో రిజర్వేషన్ల కుదించాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ విద్యార్థుల తల్లిదండ్రుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మలిరెడ్డి కోటారెడ్డి, అధ్యక్షుడు శిఖరం నరహరి, కార్యదర్శి జి.ఈశ్వరయ్య శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీట్లు తగ్గిస్తూ దళిత, గిరిజన, బలహీన వర్గాలకు నష్టం చేసేదిగా జీవో 85 ఉందన్నారు. గిరిజన ఆవాసాలు, గ్రామాలలో అత్యున్నత వైద్య సేవలు అందించేలా ప్రభుత్వ వైద్యులకు ఇన్ సర్వీస్ పీజీ కోటా గతంలో ఉండేదని గుర్తుచేశారు. పీజీ కోర్సులతో వైద్యంలో నైపుణ్యం సాధించినా గ్రామాల్లో, గిరిజన ప్రాంతాల్లో పనిచేయాలని వారికి నిబంధన పెట్టారన్నారు. క్లినికల్ విభాగంలో 30శాతం, నాన్-క్లినికల్ విభాగంలో 50 శాతం రిజర్వేషన్‌ను ఇన్ సర్వీస్ అభ్యర్థులకు ఇచ్చారని నాయకులు తెలిపారు. క్లినికల్‌లో15 శాతానికి, నాన్-క్లినికల్ విభాగంలో 30 శాతానికి కుదించడానికి జీవో 85 తేవడాన్ని నిరసిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ జీవో తక్షణమే ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని నాయకులు డిమాండ్ చేశారు.

పోలీసుల బేస్ క్యాంపుపై మావోయిస్టుల దాడి

ఎన్‌కౌంటర్‌లో ఒకరి మృతి

విశాలాంధ్ర-చింతూరు: చత్తీస్‌గఢ్ దండకారణ్యంలో మరోసారి కాల్పుల మోత మోగింది. సుక్మా జిల్లాలో భద్రతా బలగాలపై మావోయిస్టులు దాడికి పాల్పడ్డారు. దీన్ని భద్రతా బలగాలు తిప్పికొట్టాయి. ఈ క్రమంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఓ మావోయిస్టు మృతి చెందాడు. మావోయిస్టు కమాండర్ హిడ్మా స్వస్థలమైన పూర్వాతి గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. జాగుర్‌గుండా పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోలీసుల బేస్ క్యాంపుపై మావోయిస్టులు ఆకస్మికంగా దాడికి పాల్పడినట్లు సుక్మా పోలీసు సూపరింటెండెంట్ కిరణ్ చవాన్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి క్యాంపు సమీపంలో మొహరించిన మావోయిస్టుల బృందం ఒక్కసారిగా 15- 20 సార్లు యూబీజీఎల్‌తో (అండర్ బారెల్ గ్రానెడ్ లాంచ్) దాడికి పాల్పడినట్లు తెలిపారు. అయితే మావోయిస్టులు దాడి ప్రారంభించిన వెంటనే భద్రతా దళాలు ఎదురు కాల్పులు జరిపాయని, దీంతో వారు పారిపోయారని పేర్కొన్నారు. అనంతరం శనివారం తెల్లవారుజాము నుంచి అటవీ ప్రాంతంలో భద్రతా దళాలు ఆపరేషన్ చేపట్టాయి. బస్తర్ ఫైటర్లు, డీఆర్జీ పోలీసులు సంయుక్తంగా ఈ ఆపరేషన్‌లో పాల్గొని మావోయిస్టుల కోసం వేట సాగించాయి. ఈ క్రమంలో భద్రతా బలగాలపైకి మావోయిస్టులు కాల్పులు జరిపారు. పోలీసుల ఎదురుకాల్పుల్లో ఓ మావోయిస్టు మృతి చెందాడు. ఘటనా స్థలంలో పెద్దఎత్తున ఆయుధాలు, మావోయిస్టుల సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. గాలింపు కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు.

తెలియదు... గుర్తులేదు

- పోలీసులు ఏం అడిగినా వైసీపీ నేతల సమాధానం ఇదే
- సుప్రీం ఆదేశాలతో పాస్‌పోర్టులు అప్పగించిన నిందితులు
- టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసులో విచారణకు తలశిల, అప్పిరెడ్డి, అవినాశ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో నేతలు లేళ్ల అప్పిరెడ్డి, దేవినేని అవినాశ్, తలశిల రఘురామ్, న్యాయవాది గవాస్కర్ పోలీసు విచారణకు హాజరయ్యారు. 48గంటల్లో విచారణ అధికారికి పాస్‌పోర్టులు అందజేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో శనివారం వైసీపీ ఎమ్మెల్సీలు తలశిల రఘురామ్, అప్పిరెడ్డి, విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాశ్, న్యాయవాది గవాస్కర్ మంగళగిరి గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో పాస్‌పోర్టులు సమర్పించారు. అనంతరం మంగళగిరి డీఎస్పీ మురళీకృష్ణ, అదనపు ఎస్పీ కొల్లి శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు అధ్వర్యంలో వీరి విచారణ సాగింది. దర్యాప్తు అధికారులు ఏం అడిగినా మాకేమీ తెలియదు. ఆరోజు ఏం జరిగిందో గుర్తులేదని నేతలు సమాధానం చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. ఇతర ప్రశ్నల ద్వారా సమాధానం రాబట్టేందుకు అధికారులు ప్రయత్నించినా నిందితుల తీరు మారలేదని తెలిసింది. తమ అధినేత జగన్‌మోహన్ రెడ్డిని టీడీపీ నేత పట్టాభి పరుష పదజాలంతో విమర్శించినందుకే కార్యకర్తలు దాడి చేశారని, తాము ఎక్కడా ప్రత్యక్షంగా పాల్గొనలేదని వారు చెప్పినట్లు సమాచారం. ఇదిలావుంటే ముందస్తు బెయిల్ కోసం వీరంతా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్లకు మధ్యంతర రక్షణ కల్పించిన న్యాయస్థానం... విచారణకు సహకరించాలని ఆదేశించింది. కొందరు పిటిషనర్లు పారిపోయే ప్రమాదం ఉందని రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాది అనుమానం వ్యక్తం చేయగా, 48 గంటల్లోపు పాస్‌పోర్టులను దర్యాప్తు అధికారికి అప్పగించాలని కోర్టు పేర్కొంది. మరోవైపు చంద్రబాబు ఇంటిపై దాడి కేసులో నిందితుడు మాజీ మంత్రి జోగి రమేశ్ 48 గంటల్లో తమ పాస్‌పోర్టును దర్యాప్తు అధికారికి అప్పగించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. తదుపరి ఉత్తర్వులిచ్చే వరకు అరెస్టు నుంచి మధ్యంతర ఉపశమనం కల్పించింది. కేసు విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఆ లోపు రాష్ట్ర ప్రభుత్వం అఫిడవిట్ల దాఖలు చేసేందుకు కోర్టుకు అవకాశమిచ్చింది. తొలుత జోగి రమేశ్ కేసులో సీనియర్ న్యాయవాది సంజయ్ కిషన్‌కౌల్ వాదనలు వినిపించగా... న్యాయమూర్తి సుధాంశు ధులియా జోక్యం చేసుకుంటూ ఈ ఎఫ్ఐఆర్ 2021 నాటిదా? అని ప్రశ్నించారు. దీనికి న్యాయవాది అవునని సమాధానం ఇచ్చారు. అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహించిన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ జోక్యం చేసుకొని ఇన్నాళ్లు వారి పార్టీ అధికారంలో ఉన్నందునే దర్యాప్తు జరగలేదన్నారు. జోగి రమేశ్ తరపు న్యాయవాది వాదించేందుకు యత్నించినప్పుడు జస్టిస్ సుధాంశు ధులియా జోక్యం చేసుకొని 'వాళ్లు చెబుతున్నది నిజమే. మనం భారతదేశంలో ఉన్నాం కదా' అని వ్యాఖ్యానించారు.

విట్‌లో 'కెమ్‌కనెక్ట్' చాప్టర్ ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విట్ వర్సిటీలో విద్యార్థుల కోసం 'కెమ్‌కనెక్ట్' పేరుతో అమెరికన్ కెమికల్ సొసైటీ (ఏసీఎస్) చాప్టర్‌ను శనివారం ప్రారంభించారు. కెమిస్ట్రీలో విద్య.. పరిశోధనల అభివృద్ధికి విట్ ఈ కొత్త కార్యక్రమాన్ని చేపట్టింది. కెమిస్ట్రీ విభాగం అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని విభాగాధిపతి డాక్టర్ రమాకాంత్ ఇల్లా ప్రారంభించారు. ఇది అధ్యయనాలకు ఉపయోగపడుతుంది. ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డాక్టర్ సబీల్ ఎం బషీర్ ... విద్యార్థులు, అధ్యాపకులకు అందించే విలువైన వనరులు, నెట్‌వర్కింగ్ తదితర అవకాశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇది విట్‌లో ఒక మైల్ స్టోన్‌గా నిలుస్తుందని పేర్కొన్నారు.

ఎక్సైజ్ ఆదాయం పెంచుతాం

విశాలాంధ్ర-విజయవాడ:గత ప్రభుత్వం తమ స్వార్థ ప్రయోజనాల కోసం నిర్వీర్యం చేసిన ఎక్సైజ్ శాఖ పునరుద్ధరణ ఉత్తర్వులను అత్యంత పారదర్శకంగా, వేగవంతంగా విడుదలయ్యేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకున్న సీఎం చంద్రబాబు నాయుడు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆశించిన లక్ష్యాల మేరకు ఉద్యోగులు పునరంకితం అవుతారని ఎక్సైజ్ విభాగం ఎగ్జిక్యూటివ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి. నరసింహులు అన్నారు. స్థానిక గురునానక్ నగర్ కాలనీలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయ ఆవరణలో శనివారం ఉద్యోగులు, అధికారుల అధ్వర్యంలో సీఎం, ఎక్సైజ్ శాఖ మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం నరసింహులు మాట్లాడుతూ గత ప్రభుత్వ 'సెబ్' విభాగం వల్ల ఉద్యోగులకు జరిగిన నష్టం కంటే ప్రజల ఆరోగ్యానికి, ఆదాయానికి ఎక్కువ నష్టం వాటిల్లిందన్నారు. తాము ప్రభుత్వ ఆదాయం పెంచి, అక్రమార్కుల పనిపడతాం అన్నారు. విశాఖ జిల్లా అధ్యక్షుడు కామేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో మిగతా రాష్ట్రాలతో పోలిస్తే... రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ఎంతో సమర్థవంతంగా పని చేసిన చరిత్ర ఉందన్నారు. ఏపీఈఓఏ జోనల్ కార్యదర్శి వీఎస్ఎస్ఎన్. వర్మ, విజయవాడ విభాగం నాయకుడు ఆర్వీ రామశివ, జీఎస్‌కే ధనరాజ్, ఎస్. శ్రీనివాసరెడ్డి, ఎన్టీఆర్ జిల్లా హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్ సంఘం అధ్యక్షుడు వి. శ్రీరామ్ పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించింది. రాష్ట్రంలో మొత్తం 45,989 కేసులను పరిష్కరించి రూ.64.72 కోట్ల పరిహారం చెల్లించుటకు అవార్డులు జారీ చేశారు. లోక్ అదాలత్‌లో తగాదాలు పరిష్కరించుకోవడం ద్వారా భవిష్యత్తులో కక్షిదారులు సుఖసంతోషాలతో జీవిస్తారని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యనిర్వహక అధ్యక్షుడు జస్టిస్ నరేందర్ తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా శనివారం హైకోర్టు, ఇతర న్యాయస్థానాల్లో జరిగే లోక్ అదాలత్‌ను హైకోర్టు ప్రాంగణం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. అనంతరం విజయవాడ, మచిలీపట్నం న్యాయస్థానాల్లో లోక్ అదాలత్‌ను పరిశీలించారు. విజయవాడ నాల్గవ అదనపు మెజిస్ట్రేట్ కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్ ద్వారా కలిసి జీవించడానికి అంగీకరించిన భార్యభర్తలను అభినందించారు. లోక్ అదాలత్ అవార్డు కాపీని వారికి అందజేశారు. హైకోర్టు సీజే ధీరజ్ సింగ్ ఠాకూర్ మార్గదర్శకంలో లోక్ అదాలత్‌లను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించారు. హైకోర్టులో ఏర్పాటు చేసిన రెండు బెంచీలకు జస్టిస్ తార్లాడ రాజశేఖర్, జస్టిస్ శ్రీనివాస్ ఉటుకూరు అధ్యక్షత వహించారు. జాతీయ లోక్ అదాలత్ విజయవంతమైనట్లు రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి బబిత తెలిపారు. ఇందుకు తోడ్పడిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

కశ్మీరీ మహిళలకు దక్కని ప్రాతినిధ్యం

- అరకొరగానే టికెట్ల కేటాయింపు
- బరిలో నిల్చింది 15 మందే
- సాధికారత మాటలకే పరిమితం

శ్రీనగర్: మహిళలు స్వేచ్ఛగా మాట్లాడిన రోజు నిజమైన భూతల స్వర్గంగా జమ్మూకశ్మీర్ వర్ధిల్లగలదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. యుద్ధ వాతావరణంలో మహిళలు జీవిస్తున్నారు. తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయలేని భయానక పరిస్థితుల్లో బిక్కుబిక్కుమంటున్నారు. తీవ్రమైన మానసిక క్షోభను అనుభవిస్తున్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా మహిళలకు సముచిత ప్రాతినిధ్యం లభించడంలేదు. వారి సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదు.

ప్రస్తుతం జమ్మూకశ్మీర్‌లో ఎన్నికల హడావిడి ఉంది. పార్టీలన్నీ పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నాయి. దీంతో మహిళలకు సముచిత ప్రాతినిధ్యం లేదన్న చర్చ మొదలైంది. కేవలం 15 మంది మహిళా అభ్యర్థులకే టికెట్లు దక్కాయి. దీంతో తమ సమస్యలపై మాట్లాడేది ఎవరని మహిళలు మదనపడుతున్నారు. తమను, తమ సమస్యలను పక్కకు పెట్టేస్తున్నారని అంటున్నారు. మొత్తం 459 మంది అభ్యర్థులు ఎన్నికలకు సన్నద్ధమయ్యారు. తొలి రెండు దశల్లో కేవలం 15 మంది మహిళలే పోటీ చేస్తున్నారు. వీరిలో ముగ్గురు నేషనల్ కాన్ఫరెన్స్ అభ్యర్థులు కాగా ఇద్దరు పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ నుంచి, బీజేపీ, బీఎస్‌పీ, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి ఒక్కొక్కరు చొప్పున బరిలో నిలిచారు.

దక్షిణ కశ్మీర్ కుల్గామ్ జిల్లాలోని మీర్హామ గ్రామానికి చెందిన సారా అహంగర్ (60) మాట్లాడుతూ 'మాది పేద గ్రామం. పదేళ్లుగా దీనిని పట్టించుకున్న నాధుడే లేడు. కొత్త ప్రభుత్వం వస్తే పరిస్థితుల్లో మారి మా బతుకులు బాగుపడతాయన్నదే ఆశ' అని అన్నారు. అనంత్‌నాగ్‌లోని జబ్లిపుర గ్రామానికి చెందిన గుల్షన్ తన ఇంటి వద్ద ప్రచారం చేసే అభ్యర్థి దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేశారు. తన 19ఏళ్ల కొడుకును అరెస్టు చేశారని, అతనిని విడిపించాలని వేడుకున్నారు. గత అక్టోబరులో గుల్షన్ కుమారుడు యాసిర్ అరెస్టయ్యారు. ఎందుకు తెలియదని, అతని ఆటోనూ సీజ్ చేశారని ఆ తల్లి కన్నీరు పెట్టుకున్నది. తన బిడ్డ శ్రీనగర్ సెంట్రల్ జైల్లో ఉన్నాడని, అతనిని విడిపించాలని వేడుకుంది. గుల్షన్ తరహా వందల మంది మహిళలది ఇదే గాథ. మూడు దశాబ్దాలుగా కశ్మీరీ మహిళలు యుద్ధ వాతావరణంలో హింస, వేధింపులను ఎదుర్కొంటున్నారు. ప్రజా భద్రతా చట్టం, ఉపా వంటి చట్టాల కింద కేసుల్లో పిల్లలు చిక్కుకోవడంతో తల్లడిల్లిపోతున్నారు.

అరెస్టులన్నవి ప్రాంతీయ పార్టీలకు ప్రధానాంశం. రాజకీయ ఖైదీలు, యువతను విడిపించేందుకు ప్రాధాన్యత ఇస్తామని నేషనల్ కాన్ఫరెన్స్ హామీ ఇవ్వగా, ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తామని పీడీపీ భరోసా ఇచ్చింది. రాక్షస చట్టాల రద్దుకు కృషి చేస్తామని పీపుల్స్ కాన్ఫరెన్స్ వంటి ఇతర పార్టీలు వాగ్దానం చేశాయి, శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన నేరం కింద అరెస్టైన యువతకు క్షమాభిక్ష లభించేందుకు ప్రయత్నిస్తామన్నాయి. ఉత్తర కశ్మీర్‌లోని బరాముల్లా జిల్లా డెలీనా గ్రామానికి చెందిన హసీనా బేగం కొత్త ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. పిల్లలు కోసం ఆట మైదానం, నిరంతరాయ నీటి సరఫరా, మెరుగైన రోడ్లు వస్తాయని ఆకాంక్షించారు. జమ్మూకశ్మీర్ ప్రధాన ఎన్నికల అధికారి ఆగస్టులో చేసిన ప్రకటన ప్రకారం మొత్తం 88.03 లక్షల మంది ఓటర్లలో 42,13లక్షల మంది మహిళలు ఉన్నారు. అంటే 50శాతానికి కాస్త తక్కువ. గత ఎన్నికలప్పటి నుంచి మహిళా ఓటర్లు 51,142 మంది పెరిగారు. శ్రీనగర్ జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే ఎక్కువ.

మహిళల సమస్యలకు ప్రాధాన్యత లభించదని, ముఖ్యంగా కశ్మీర్‌లో ఈ పరిస్థితి ఉందని నేషనల్ కాన్ఫరెన్స్ నాయకులు శ్రీయా హండూ అన్నారు. రాజకీయ అనిశ్చితి, ఆర్థిక సంక్షోభం, సామాజిక ఆంక్షలు వంటివి మహిళలను తొక్కేసాయన్నారు. వారి బాధలను తీర్చే నాధుడే కరువయ్యాడని, దశాబ్దంగా మహిళలు మరింతగా అణచివేయబడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. మంచి ఆరోగ్య సంరక్షణ, సరిపడ ప్రసూతి సెలవులు పొందడం మహిళలకు కష్టసాధ్యమని కశ్మీర్ వర్సిటీ విద్యార్థిని ఆతీనా జెహగిర్ (22) అన్నారు. మహిళలు పంచాయతీలకు పరిమితమని, ముఖ్యమంత్రి మహిళ అయితే ఆమెకు పూర్తిగా ఆదరించరని చెప్పారు. మహిళా సాధికారత సాధనకు ఇంకా చాలా చేయాల్సి ఉందన్నారు. 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్ రాష్ట్ర మహిళా కమిషన్ రాత్రికి రాత్రి నిర్వీర్యమైంది. పర్యవసానంగా గృహ హింసతో పాటు మహిళలపై నేరాల కేసులు మరుగున పడ్డాయి. 'జాతీయ మహిళా కమిషన్ గురించి కశ్మీరీ మహిళలకు అవగాహన లేదు. స్థానికంగా వారి సమస్యలను పరిష్కరించే యంత్రాంగం లేదు' అని 'ఆష్' ఎన్జీవో నడిపే కూరత్ మసూదీ అన్నారు. కశ్మీర్ మహిళలలో అభద్రతా భావం ఎక్కువని శ్రీనగర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ & న్యూరోసైన్సెస్ ప్రొఫెసర్ డాక్టర్ యాసిర్ రథేర్ తెలిపారు. తమ సమస్యల గురించి చర్చించుకునే స్వేచ్ఛ మహిళలకు లేదన్నారు. 'తల్లిదండ్రులు , మిత్రులతో కొన్నిసార్లు భర్తలతో సమస్యలు పంచుకుంటుంటారు. కొత్త తరానికీ ఇదే నేర్పుతున్నారు. ఓర్పుకు వారు చెప్పే నిర్వచనం ఇదే' అని ప్రొఫెసర్ అన్నారు.

పార్టీ సమావేశాలు, ర్యాలీల్లో మహిళా అభ్యున్నతి గురించి అవగాహన కల్పిస్తున్నట్లు జేకే అప్నీ పార్టీ మహిళా అధ్యక్షురాలు దిల్షాద్ షాహీన్ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం (మార్చి 8)న తమ పార్టీ ఏర్పాటు కావడం యాధృచికం కాదని, మహిళా సాధికారతకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. అమన్‌దీప్ కౌర్ (అవామీ ఇతెహాద్ పార్టీ సభ్యులు) మాట్లాడుతూ స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను చెప్పగలిగిన వాతావరణం కశ్మీర్ మహిళలకు అవసరమన్నారు. '25 ఏళ్లలో ముఖ్యంగా గత ఐదు సంవత్సరాల్లో జరిగినది పునరావృతం కాకూడదని నొక్కిచెప్పారు. 'కశ్మీర్ మహిళలు స్వేచ్ఛగా మాట్లాడగలగాలి. అందుకోసం అనువైన వాతావరణం ఉండాలి. ఇది ప్రతి ఒక్కరికి అవసరం' అని కౌర్ అన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.